ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 26.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 306 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu





దిగ్గజ నటుడు ధర్మేంద్రకు
పద్మవిభూషణ్

- కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్
- కేరళకే చెందిన కేటీ.థామ్స్, సాహితీవేత్త పి.నారాయణన్
- కళల విభాగంలో ఎన్.రాజాంలకు కూడా
- ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్
- 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు
- 11 మంది తెలుగు వారికి పద్మ పురస్కారాలు
- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్ తదితరులకు పద్మశ్రీ

...:: 2లో

గుంటనక్క ట్రాప్‌లో కేటీఆర్

పెద్ద చేపను కాపాడేందుకు హరీశ్ రావు స్క్రిప్ట్



- మేఘా కృష్ణారెడ్డిని కాపాడే ప్రయత్నం
- దళిత మహిళలపై కథనాలు బాధపెట్టాయి
- జర్నలిస్టులను అరెస్ట్ చేసిన తీరును ఖండిస్తున్నాం
- నోటీసులు ఇచ్చి వివరణ అడగాల్సింది
- ఒక పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా భట్టి ప్రెస్‌మీట్
- దాని వెంటనే హరీష్ రావు ప్రెస్‌మీట్ పెట్టారు
- ఆ తర్వాత అదే బాట కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టారు
- మొత్తం నైనీ టెండర్ల రద్దు ప్రకటన కూడా స్క్రిప్ట్‌లో భాగమే
- వచ్చే ఎన్నికల్లో గెలిచేది జాగృతి పార్టీనే
- మహేష్ కుమార్ గౌడ్‌ను జాగృతి పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం
- ఆయన వస్తే నేషనల్ కన్వీనర్ పదవి ఇస్తాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 25: సింగరేణి కాంట్రాక్టుల వ్యవహారంలో పెద్ద కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు బీఆర్ఎస్ నేత హరీష్ రావు గుంటనక్కలా వ్యవహరిస్తూ రాజకీయ స్క్రిప్ట్ రాస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ, చిన్న చేపను పెద్దగా చూపించి, రూ.25 వేల కోట్ల కాంట్రాక్ట్ చేపట్టే మేఘా కృష్ణారెడ్డి అనే పెద్ద చేపను కాపాడే ప్రయత్నం మొత్తం హరీష్ రావు చుట్టూనే తిరుగుతోందని అన్నారు. హరీష్‌రావు ప్రెస్‌మీట్‌ను గుడ్డిగా ఫాలో అయి చివరకు కేటీఆర్ కూడా అదే ట్రాప్‌లో పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో దారుణమైన ట్రెండ్ మొదలైందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత అన్‌పాపులర్ యూట్యూబ్ ఛానెల్స్‌లో వచ్చిన కథనాలనే ఎలాంటి పరిశీలన లేకుండా శాటిలైట్ ఛానెల్స్‌లో ప్రసారం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. ముఖ్యంగా దళిత మహిళలపై అవమానకరమైన కథనాలు వేయడంపై తాము తీవ్రంగా బాధపడ్డామని చెప్పారు. గతంలో లైన్ అతిక్రమించిన యూట్యూబ్ ఛానెల్స్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్టులు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మరింత ముందుకెళ్లి శాటిలైట్ ఛానెల్ ప్రతినిధులను కూడా అరెస్ట్ చేసిందని గుర్తు చేశారు. అయితే

...:: మిగతా 2లో



అన్ని అవినీతి టెండర్లపై విచారణ జరపాలి

- సింగరేణి ఓబీ టెండర్లలో భారీ కుంభకోణం
- ఈ కుంభకోణానికి రేవంత్ రెడ్డే సూత్రధారి
- ఆయన బావమరిది సృజన్ రెడ్డి మొదటి లబ్ధిదారుడు
- మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ

...:: 2లో



రాజ్యాంగమే జాతీయ స్ఫూర్తి, దేశ ఐక్యతకు పునాది

- వికసిత భారత్ నిర్మాణంలో నారీ శక్తి పాత్ర కీలకం
- వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు
- స్వయం ఉపాధి నుంచి సాయుధ దళాల వరకు
- ప్రతి రంగంలోనూ తమదైన ముద్ర
- రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 25: రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ నిబంధనల ద్వారా జాతీయ స్ఫూర్తికి, దేశ ఐక్యతకు బలమైన పునాదిని వేశారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. దేశ ప్రజలమైన మనం స్వదేశంలో, విదేశాల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోబోతున్నామని స్పష్టం చేశారు. సోమవారం దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ద్రౌపదీ ముర్ము ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగించారు. భారతీయ మహిళలు సంప్రదాయ మూస పద్ధతులను బద్దలు కొట్టి ముందుకు సాగుతున్నారని ద్రౌపదీ ముర్ము కొనియాడారు. నారీమణులు దేశ సర్వతోముఖాభివృద్ధికి చురుకుగా తోడ్పడుతున్నారని వెల్లడించారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు, స్వయం ఉపాధి నుంచి సాయుధ దళాల వరకు ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారని

...:: మిగతా 2లో



వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్‌దే

- పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటాలి
- సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు
- విధేయత,చిత్తశుద్ధి ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక
- కష్టపడే ప్రతీ ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుంది
- పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన వారికి సముచిత స్థానం
- పట్టణ ప్రాంతాల అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్ పార్టీదే
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

...:: 2లో



టీ20 సిరీస్ భారత్ కైవసం

టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఆతిథ్య భారత జట్టు మరోసారి అదరగొట్టింది. స్వదేశంలో 15 నెలల వ్యవధిలోనే న్యూజిలాండ్‌కు టెస్టు, వన్డే సిరీస్‌ను కోల్పోయి తీవ్ర విమర్శలెదుర్కొంటున్న టీమ్ఇండియా.. టీ20ల్లో మాత్రం కివీస్‌కు ఆ అవకాశమివ్వలేదు.

10



శుభాంశు శుక్లాకు అశోక చక్ర

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించి తొలి భారతీయుడిగా రికార్డుకెక్కిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు భారతదేశ అత్యున్నత శౌర్య పురస్కారమైన అశోక చక్ర ప్రకటించింది.

9



బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ యువకుడి సజీవ దహనం!

బంగ్లాదేశ్‌లో ఓ హిందూ యువకుడిని దుండగులు సజీవ దహనం చేశారు. శుక్రవారం రాత్రి నార్సింగ్డి ప్రాంతంలోని ఓ షాప్‌లో చంచల్ చంద్ర భౌమిక్(23) అనే యువకుడు నిద్రిస్తుండగా దుండగులు దాడి చేశారు.

9



బంకర్‌లో ఇరాన్ సుప్రీం

అమెరికా దాడి చేస్తుందనే భయాలు ఇరాన్ ను చుట్టుముట్టాయి. దాంతో దేశాధినేతల రక్షణ కోసం అధికారులు చర్యలు మొదలుపెట్టారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని టెహ్రాన్‌లోని సురక్షితమైన బంకర్‌కు తరలించినట్లు సమాచారం.

9

రాష్ట్రీయం

దిగ్గజ నటుడు ధర్మేంద్రకు పద్మభూషణ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 25: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో అసమాన సేవలు అందించిన వారికి తాజాగా పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. ఏపీ, తెలంగాణకు చెందిన 11 మందికి పద్మ పురస్కారాలు వరించాయి. బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించింది. కేరళకే చెందిన కె.టి.థామ్స్, సాహితీవేత్త పి.నారాయణన్‌కు కూడా పద్మ విభూషణ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కళల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు ఎన్.రాజాంకు పద్మవిభూషణ్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రముఖ గాయని ఆల్కా యాజ్ఞిక్, మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారికి పద్మభూషణ్ ప్రకటించింది. వైద్యరంగంలో తమిళనాడుకు చెందిన కళ్లిపల్లి రామస్వామి పళనిస్వామి, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కళల విభాగంలో మళయాళం దిగ్గజ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కళల రంగంలో మహారాష్ట్రకు చెందిన పీయూష్ పాండేకు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించింది. సామాజిక సేవారంగంలో తమిళనాడుకు చెందిన ఎస్‌కేఎం మయిలనందన్, కళల రంగంలో కర్ణాటకకు చెందన శకవర్ధనీ గణేష్‌కు మూడో అత్యున్నత పురస్కారం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరేన్‌కు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించిన కేంద్రం, ప్రజావ్యవహారాల విభాగంలో వి.కె.మల్హోత్రాకూ ఇవ్వనున్నట్లు తెలిపింది. వాణిజ్య రంగంలో ఉదయ్ కోటక్, ప్రజా వ్యవహారాల రంగంలో కేరళకు చెందిన వల్లాపల్లి నటేషన్, క్రీడారంగంలో విజయ్ అమృతరాజ్ పద్మభూషణ్ పురస్కారాలకు ఎంపికయ్యారు.

45 మంది తెర వెనుక వ్యక్తులు

మొత్తం 113 పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన కేంద్రం, వారిలో 45 మంది తెర వెనుక వ్యక్తులను ఎంపిక చేసింది. సినీ రంగానికి సంబంధించి ప్రముఖ నటులు మురళీమోహన్ (తెలుగు), రాజేంద్ర ప్రసాద్ (తెలుగు), ఆర్. మాధవన్(తమిళ్)కు పద్మశ్రీలను ప్రకటించింది. క్రీడారంగంలో రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, హాకీ క్రీడాకారిణి సవిత పూనియాకు పద్మశ్రీలు అందిస్తామని తెలిపింది. ఇక తెలంగాణకు చెందిన డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, రామారెడ్డి మామిడి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. కుమారస్వామి తంగరాజ్ ప్రముఖ (సీసీఎంబీ) శాస్త్రవేత్త. మానవ పరిణామ క్రమం, జన్యుసంబంధ వ్యాధులపై ఆయన పలు పరిశోధనలు చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. మరోవైపు పశుసంవర్థక, పాడి పరిశ్రమకు చేసిన కృషికిగానూ రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం వరించింది.

సీఎం అభినందనలు

పద్మ పురస్కారాలకు ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమనుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్థక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌లకు పద్మ శ్రీ పురస్కారాలు రావడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. సేవా, కళా, ఇతర రంగాల్లో వారు చూపిన అంకితభావం, సేవలతోనే ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపికయ్యారని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ నుంచి :

గూడూరు వెంకట్రావు (వైద్యం)కు పద్మశ్రీ
రామారెడ్డి మామిడి (మరణానంతరం)
పశుసంవర్థక, పాడి పరిశ్రమ
కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ (సైన్స్)కు పద్మశ్రీ
గడ్డమనుగు చంద్రమౌళి (సైన్స్ విభాగం)కి పద్మశ్రీ
దీపికారెడ్డి (నృత్యకారిణి)కి పద్మశ్రీ
పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి (వైద్యం)కు పద్మశ్రీ
యూజీసీ మాజీ చైర్మన్
మామిడాల జగదీశ్‌కుమార్‌కు పద్మశ్రీ

ఆంధ్రప్రదేశ్ నుంచి :

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పద్మశ్రీ
వెంపటి కుటుంబశాస్త్రి (సాహిత్యం)కి పద్మశ్రీ
సినీనటుడు గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్ కళలు
మాగంటి మురళీ మోహన్ కళలు



వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్‌దే

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 25: వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో నిజామాబాద్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా చేపట్టిన అభివృద్ధి, అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మీద విశ్వసనీయతను పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధిని అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకపోయేందుకు కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ కృషి చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. పురపాలక సంఘం ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు గాను లోకసభ నియోజకవర్గాల వారిగా మంత్రులను ఇంచార్జీలుగా నియమంచిన విషయం విదితమే. ఆ క్రమంలో భాగంగ నిజామాబాద్ లోకసభ నియోజకవర్గానికి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని నిజమాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మెట్పల్లి, కోరుట్ల పురపాలక సంఘం పరిధీలలో నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి, మరో ప్రభుత్వ సలహదారు యం.డి షబ్బీర్ అలీ నిజమాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి, శాసనమండలి సభ్యులు బల్మూరి వెంకట్, కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ మాజీ శాసనమండలి సభ్యులు నర్సిరెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పురపాలక సంఘం మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తామని ఆయన ప్రకటించారు. సర్వేతో పాటు విధేయత, చిత్తశుద్ధి, క్రమశిక్షణ ల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఆయన తెలిపారు. అదే సమయంలో అవకాశం రాని వారికి ప్రత్యమ్నాయ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటేనే అది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతోటే అని ఆయన అన్నారు. పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జరుగుతున్న అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసీ, పట్టణ ప్రాంతాలలో మెరుగైన అభివృద్ధి జరుపుతామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదట జరుగుతున్న అభివృద్ధి అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళితే పురపాలక సంఘం ఎన్నికల్లో విజయదుందుభి మ్రోగిస్తామని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు. అర్హులైన నిరుపేదలకు యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు ఆ బియ్యం వినియోగించేందుకు ప్రజలు ఇష్ట పడక పోగా వాటిని అమ్ముకునే వారని ఆయన చెప్పారు. దొడ్డు బియ్యం ప్రజలు వినియోగించుకోక పోగా పక్కదారి పట్టి అనేక అక్రమాలు జరిగేవని ఆయన చెప్పారు. అటువంటి అవకతవకలకు చెక్ పెట్టడంతో పాటు రాష్ట్రంలోని 85% ప్రజలకు 13,600 కోట్ల వ్యయంతో ఉచితంగా సన్నబియ్యం అందించిన విప్లవాత్మక నిర్ణయం కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ఒక్క నిజమాబాద్ కార్పొరేషన్ పరిధిలోనే 18,000 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. నిరుపేదల కడుపు నింపేందుకు ఉద్దేశించబడిన నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ ఉచితంగా అందిస్తున్న అంశం తనకెంతో తృప్తి నిచ్చిందని ఆయన చెప్పారు. నిరుపేదల కళ్లలో వెలుగులు నింపాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంకల్పమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హులైన నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయక పోగా ఉన్న కార్డులలో కొత్త సభ్యుల చేర్పులకు కుడా అవకాశం ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. ఇటువంటి అంశాలతో ప్రజల దగ్గరకు పోతే అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదే నన్న వాస్తవాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విస్మరించరాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవుపలికారు.



సింగరేణి టెండర్ల రద్దుపై విచారణకు సిద్ధం. టెండర్లలో స్కామ్ జరిగితే ఉపేక్షించబోం. కిషన్ రెడ్డి లేఖ రాస్తే దగ్గరుండి విచారణ చేయిస్తా. నా సోదరుల కంపెనీలతో నాకు సంబంధం లేదు. నాకు ఏ కంపెనీలో వాటా లేదు. డబ్బులే కావాలనుకుంటే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ఎందుకు చెబుతా?. మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి కోసమే బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోంది.

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రాజ్యాంగమే జాతీయ స్ఫూర్తి, దేశ ఐక్యతకు పునాది



మొదటిపేజీ తరువాయి

తెలిపారు. క్రీడా రంగంలోనూ టీమ్ ఇండియా ఒమెన్ క్రికెటర్లు ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలను నెలకొల్పారని గుర్తు చేసుకున్నారు. "గతేడాది నవంబర్‌లో టీమ్ ఇండియా మహిళా క్రికెటర్లు ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను, ఆ తర్వాత బ్లైండ్ మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు. గత సంవత్సరం చెస్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ ఇద్దరు భారతీయ మహిళల మధ్య జరిగింది. ఈ ఉదాహరణలు క్రీడా ప్రపంచంలో భారత్‌కు చెందిన నారీమణుల ఆధిపత్యానికి నిదర్శనం. దేశ ప్రజలు వారిని చూసి గర్విస్తున్నారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళా ప్రతినిధుల సంఖ్య దాదాపు 46 శాతంగా ఉంది. మహిళల రాజకీయ సాధికారతను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు 'నారీ శక్తి వందన్ అధినియం' మరింత బలాన్ని ఇస్తుంది. వికసిత భారత్ నిర్మాణంలో నారీ శక్తి పాత్ర కీలకమైనది" అని ముర్ము అన్నారు.

ప్రపంచానికి భారత్‌శాంతి సందేశం

పలు ఖండాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో మానవాళి భవిష్యత్తును సురక్షితం చేయడానికి అత్యంత కీలకమైన శాంతి సందేశాన్ని భారత్ ప్రపంచానికి అందిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. ఈ క్రమంలో శాంతికి దూతగా భారత్‌ను అభివర్ణించారు. ప్రపంచమంతటా శాంతి ఉంటేనే మానవాళి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే ఆపరేషన్ సిందూర్, మహిళా సాధికారత, వందేమాతరం, బలపడుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలను తన ప్రసంగంలో ముర్ము ప్రస్తావించారు.

గిరిజన, అణగారిన వర్గాలను కలుపుని వెళ్లాలి

అంత్యోదయ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ దేశ పౌరులు తిరిగి పేదరికంలో జారిపోకుండా చూసుకోవడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రస్తుతం దాదాపు 81 కోట్ల మంది లబ్ధిదారులకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు కీలకమైన మద్దతును అందిస్తున్నాయని వెల్లడించారు. వికసిత్ భారత్ ప్రయాణంలో గిరిజన, అణగారిన వర్గాలను కలుపుని వెళ్లాలని అభిప్రాయపడ్డారు. పేదల సంక్షేమం కోసం చేసే ఇటువంటి ప్రయత్నాలు మహాత్మా గాంధీ సర్వోదయ (అందరికీ పురోగతి) అనే ఆదర్శానికి నిర్దిష్ట రూపాన్ని ఇస్తాయని అన్నారు. భారత రాజ్యాంగం ఇప్పుడు ఎనిమిదవ షెడ్యూల్‌లో జాబితా చేసిన 22 భాషల్లో అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇది పౌరులు వారి మాతృభాషలో రాజ్యాంగం చదవడానికి వీలు కల్పిస్తుందని వివరించారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్

ప్రస్తుతం ప్రపంచంలోని డిజిటల్ లావాదేవీల్లో సగానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదలను ముర్ము ప్రశంసించారు. ఈ పటిష్ఠతకు లోతైన నిర్మాణాత్మక సంస్కరణలు, ఆత్మనిర్భరత పట్ల నిబద్ధతే కారణమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, సమీప భవిష్యత్తులో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా భారత్ దూసుకెళ్తోందన్నారు. తన ప్రసంగంలో జాతీయ గేయం వందేమాతరం గురించి కూడా ముర్ము ప్రస్తావించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో వందేమాతరం భాషా హద్దులను దాటి ప్రజలను ఏకం చేసిందని తెలిపారు. వివిధ భారతీయ భాషల్లోకి ఈ గేయం అనువాదం అయ్యి ప్రాచుర్యం పొందిందని గుర్తు చేసుకున్నారు.

గుంటనక్క ట్రాప్‌లో కేటీఆర్

మొదటిపేజీ తరువాయి



జర్నలిస్టులను అరెస్ట్ చేసిన తీరును తాము ఖండిస్తున్నామని, వాళ్లు టెర్రరిస్టులు కాదని, నోటీసులు ఇచ్చి వివరణ అడగాల్సిందని అన్నారు. ఈ పరిణామాలను అవకాశంగా మార్చుకొని బీఆర్ఎస్ జర్నలిస్టులకు సపోర్ట్‌గా నిలిచిందని, కానీ కేటీఆర్‌పై ఇలాంటి కథనాలు వచ్చినప్పుడు ఆయన అనుచరులు ఒక ఛానెల్‌పై దాడి చేసిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. మహిళలపై కథనాల విషయంలో ఒక నీతి, దళిత మహిళపై కథనాల విషయంలో మరో నీతా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఒక దళిత ఆడబిడ్డపై కథనాలు వస్తే ఆమెకు అండగా నిలవని రాజకీయ వైఖరిని ప్రజలు గమనించాలని చెప్పారు. సింగరేణి నైనీ బ్లాక్ కాంట్రాక్టుల విషయంలో హరీష్ రావు అసలు నిజాలను దాచిపెట్టి రాజకీయ డ్రామా నడుపుతున్నారని కవిత ఆరోపించారు. సృజన్ రెడ్డికి కేవలం రూ.250 కోట్ల కాంట్రాక్ట్ మాత్రమే వచ్చిందని, కానీ ఆయన సీఎం బావమరిది అనే పేరుతో చిన్న చేపను పెద్దగా చూపిస్తూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. అదే సమయంలో రూ.25 వేల కోట్ల కాంట్రాక్ట్ చేపట్టే మేఘా కృష్ణారెడ్డి గురించి బీఆర్ఎస్ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. అసలు సృజన్ రెడ్డికి కాంట్రాక్టులు ఇచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడెందుకు ఆయన బంధుత్వం గుర్తుకు రాలేదని నిలదీశారు. ఒక పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా భట్టి విక్రమార్క ప్రెస్‌మీట్ పెట్టారని, దాని వెంటనే హరీష్ రావు ప్రెస్‌మీట్ పెట్టారని, ఆ తర్వాత అదే లైన్‌ను ఫాలో అయి కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టారని కవిత వివరించారు. మొత్తం నైనీ టెండర్ల రద్దు ప్రకటన కూడా ఇదే స్క్రిప్ట్‌లో భాగమన్నారు. తాము కాంట్రాక్టర్ల పక్షాన కాకుండా కార్మికుల పక్షానే మాట్లాడుతామని స్పష్టం చేశారు. రెండేళ్లుగా కార్మికుల సమస్యలపై తాము ఎన్నిసార్లు మాట్లాడినా భట్టి గానీ, బీఆర్ఎస్ గానీ స్పందించలేదని, కానీ ఒక తిమింగళం లాంటి కాంట్రాక్టర్‌కు అన్యాయం జరిగితే మాత్రం అందరూ ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్సెస్ టెండర్లు ఇవ్వలేదని కేటీఆర్ చెప్పడం పూర్తిగా అబద్ధమని కవిత పేర్కొన్నారు. 36, 16, 7, 8 శాతం ఎక్సెస్‌కు అనేక టెండర్లు ఇచ్చారని చెప్పారు. గతంలో సైట్ విజిట్ నిబంధన కన్వేయర్ బెల్ట్ లాంటి పనులకు మాత్రమే ఉండేదని, ఇప్పుడు ఓబీ పనులకు కూడా పెట్టడం వెనుక పెద్ద కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చే ప్రయత్నం ఉందని ఆరోపించారు. సాయిల్ ఎక్స్కవేషన్ పేరుతో మేఘా సంస్థకు అనుభవం ఉందని చూపించి రూ.25 వేల కోట్ల కాంట్రాక్ట్ కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. సింగరేణిలో అమలు చేస్తున్న ఎండీవో విధానం సంస్థను నష్టాల బాట పట్టిస్తోందని కవిత అన్నారు. గతంలో ఓపెన్‌కాస్టలతో సింగరేణికి లాభాలు వచ్చాయని, కానీ ఎండీవో విధానం తెచ్చి సంస్థను అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణిపై రూ.25 వేల కోట్ల అప్పు పెట్టారని, కాంగ్రెస్ వచ్చాక అది రూ.50 వేల కోట్లకు చేరిందని తెలిపారు. పవర్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు ఇవ్వకపోవడంతో జీతాలకూ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఎండీవో విధానాన్ని కూడా రద్దు చేయాలి

నైనీ టెండర్లు రద్దు చేసినట్టే ఎండీవో విధానాన్ని కూడా రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌ను సింగరేణే ఓపెన్‌కాస్ట్‌గా నిర్వహిస్తే తెలంగాణ కార్మికులకు ఉద్యోగాలు వస్తాయని, సంస్థకు మేలు జరుగుతుందని చెప్పారు. తాడిచర్ల వంటి నాణ్యమైన బ్లాక్‌లను కూడా ఎండీవో విధానంలో ఇచ్చి సంస్థకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పూర్తిగా జోక్‌గా మారిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా విచారణ పేరుతో సాగదీస్తూ బాధితులకు న్యాయం చేయడం లేదన్నారు. ట్యాపింగ్ చేసినవారికి కాకుండా బాధితులకే నోటీసులు ఇస్తున్న పరిస్థితి దారుణమని, ఇది మున్సిపల్ ఎన్నికల కోసమే ప్రభుత్వం చేస్తున్న రాజకీయ డ్రామా అని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో లూజింగ్ పార్టీగా మారిందని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది జాగృతి పార్టీనేనని కవిత ధీమా వ్యక్తం చేశారు. మహేష్‌కుమార్ గౌడ్‌ను జాగృతి పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని, ఆయన వస్తే నేషనల్ కన్వీనర్ పదవి ఇస్తామని ప్రకటించారు. తనను కాంగ్రెస్‌లో చేరుతున్నానంటూ కావాలనే బద్నాం చేస్తున్నారని, జాగృతి పార్టీ ప్రజల కోసం సీరియస్ రాజకీయ శక్తిగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎవరైనా సరే కార్మికుల పక్షాన నిలవాలని కవిత తేల్చి చెప్పారు. కాంట్రాక్టర్ల కోసం కాదు, కార్మికుల కోసం పనిచేసే పార్టీ జాగృతే అని స్పష్టం చేశారు.

అన్ని అవినీతి టెండర్లపై విచారణ జరపాలి

- సింగరేణి ఓబీ టెండర్లలో భారీ కుంభకోణం
- ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి
- ఆయన బావమరిది సృజన్ రెడ్డి మొదటి లబ్ధిదారుడు
- సింగరేణి కార్మికుల హక్కులు, ఆస్తులను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం
- మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, 25: సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో ఖరారైన అన్ని ఓబీ వర్క్స్, సోలార్ పవర్ ప్లాంట్ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, నైనీ గోల్డ్ బ్లాక్ టెండర్‌తో పాటు అన్ని అవినీతి టెండర్లపై విచారణ జరపాలని ర్ల విషయంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని డిమాండ్ చేశారు. ఈ మొత్తం కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని కోరిన హరీష్ రావు, సింగరేణి కార్మికుల హక్కులు, ఆస్తులను కాపాడే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సింగరేణి కాలరీస్‌లో ఓబీ (ఓవర్‌బర్డన్) రిమూవల్ టెండర్ల విషయంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి మొదటి లబ్ధిదారుడని మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ సింగరేణి టెండర్ ప్రక్రియలో పారదర్శకత, పోటీ, న్యాయం అనే మౌలిక సూత్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని హరీష్ రావు ఆరోపించారు. ఓబీ రిమూవల్ పనులకు వర్తించని "సైట్ విజిట్ కన్ఫర్మేషన్ సర్టిఫికేట్" అనే కొత్త నిబంధనను కావాలని ప్రవేశపెట్టి, ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. భట్టి విక్రమార్క ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్‌ను ప్రస్తావించిన హరీష్ రావు, బొగ్గు కుంభకోణంపై స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా, సంబంధం లేని డాక్యుమెంట్లు చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. "ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే" అన్న సామెతను ఆయన ప్రస్తావించారు. 2018లో సీఎంపీడిఐ ఇచ్చిన సిఫార్సులు ఓబీ రిమూవల్ పనులకు వర్తించవని, అవి పరిమిత ప్రాంతాల్లో జరిగే డిజైన్, సరఫరా, ఇన్‌స్టాలేషన్ వంటి పనులకే సంబంధించినవని స్పష్టం చేశారు. సైనిక్ స్కూల్‌లో క్లాత్ డ్రైయర్ ఇన్‌స్టాలేషన్ టెండర్‌ను ఉదాహరణగా చూపించి, దాన్ని సింగరేణి వేల కోట్ల ఓబీ కాంట్రాక్టులకు అన్వయించడం హాస్యాస్పదమని అన్నారు. 2018 నుంచి 2024 వరకు పిలిచిన వందలాది ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికేట్ షరతు ఎక్కడా లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే 2025-26లో ఈ నిబంధనను ఎంపిక చేసిన టెండర్లకు మాత్రమే అమలు చేశారని ఆరోపించారు. జనవరి 2025లో భూపాలపల్లి టెండర్‌కు ఈ షరతు లేకుండానే అంచనా రేట్ల కంటే 7 శాతం తక్కువకు పనులు అప్పగించారని, కానీ మే 2025లో వీకే ఓసీ టెండర్‌కు ఈ నిబంధన పెట్టి పోటీ తగ్గించారని తెలిపారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ ఇవ్వడంలో పెద్ద ఎత్తున వివక్ష జరిగిందని హరీష్ రావు పేర్కొన్నారు. అనేక కాంట్రాక్టర్లు సైట్ విజిట్ చేసినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా, కేవలం 2-3 సంస్థలకు మాత్రమే బ్యాక్‌డేటెడ్ సర్టిఫికెట్లు జారీ చేశారని ఆరోపించారు. దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఓబీ స్కాం మాత్రమే కాకుండా సోలార్ పవర్ ప్లాంట్లు, పేలుడు పదార్థాల కొనుగోలు, ఉద్యోగుల డీప్రొమోషన్ వంటి అనేక అంశాల్లో అవినీతి జరిగిందని హరీష్ రావు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని గణాంకాలతో వివరించారు. బీఆర్ఎస్ హయాంలో 2023లో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించగా, 2024-25లో అది 69 మిలియన్ టన్నులకు, 2025-26లో ఇప్పటివరకు 43 మిలియన్ టన్నులకు పడిపోయిందని అన్నారు. సింగరేణి కార్మికుల బోనస్‌లో కోత విధించి, లాభాలను దాచిపెట్టారని, ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు.

రాజకీయం

విలువలతో కూడిన అభివృద్ధే నిజమైన ప్రగతి

- చిన్మయ మిషన్ అమృత మహోత్సవంలో డిప్యూటీ సీఎం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 25: విలువలతో కూడిన అభివృద్ధే నిజమైన ప్రగతి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. చిన్మయ మిషన్ సమాజానికి అందిస్తున్న ఆధ్యాత్మిక, విద్యా సేవలు నేటి కాలానికి ఎంతో అవసరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవం (అమృత మహోత్సవం) కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం కేవలం కాల పరిమాణం మాత్రమే కాదని, కాలాతీతమైన విలువలతో సమాజ అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న సంస్థగా చిన్మయ మిషన్ నిలిచిందని పేర్కొన్నారు. ఇదే ఒక జీవంత సంప్రదాయానికి నిదర్శనమన్నారు. పూజ్య గురుదేవ్ స్వామి చిన్మయానంద గారి బోధనలు నేటికీ అత్యంత అవసరమని తెలిపారు. ఆధ్యాత్మికత అంటే ప్రపంచం నుంచి దూరంగా ఉండడం కాదని, బాధ్యతతో సమాజంలో భాగస్వామిగా నిలవడమేనని గురుదేవ్ బోధించారని గుర్తు చేశారు. నేటి కాలంలో సాంకేతిక, భౌతిక అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పటికీ, ఒత్తిడి, అసమానతలు, సామాజిక అంతరాలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విలువలు లేని అభివృద్ధి అసంపూర్ణమని కరుణ లేని వృద్ధి నిలకడగా ఉండదని ఆయన స్పష్టం చేశారు. అందుకే చిన్మయ మిషన్ వంటి సంస్థల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. భగవద్గీత స్వార్థరహిత కర్మ, నైతిక నాయకత్వం, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని బోధిస్తుందని చెప్పారు. ఇవే నేటి పాలనకు కూడా మార్గదర్శక సూత్రాలని పేర్కొన్నారు. బాలవిహార్, యువత కార్యక్రమాలు, అధ్యయన వర్గాల ద్వారా చిన్మయ మిషన్ విలువలతో కూడిన పౌరులను తయారు చేస్తోందని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. రేపటి వైద్యులు, ఇంజినీర్లు, అధికారులు నైతిక విలువలతో ఎదగడానికి ఇది దోహదపడుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే దృక్పథంతో పాలన సాగిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి పౌరుడు ఆత్మ గౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, రైతులు, కార్మికులు, మహిళలు, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇది దానం కాదని, రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని ఆయన స్పష్టం చేశారు. "గీతా పంచామృతం" వంటి కార్యక్రమాలు ప్రజలకు సులభంగా గీత బోధనలను అర్థమయ్యేలా చేస్తున్నాయని ప్రశంసించారు. హైదరాబాద్ ఎప్పుడూ భిన్న సంస్కృతులు, భాషలు, మతాల మధ్య సమరస్యానికి ప్రతీకగా నిలిచిందని, ఆ సంప్రదాయాన్ని చిన్మయ మిషన్ హైదరాబాద్ మరింత బలపరుస్తోందని అన్నారు. పాలన అనేది కేవలం ఫైళ్లు మాత్రమే కాదని, ప్రజల విశ్వాసమే ముఖ్యమని ఆయన తెలిపారు. ఆ విశ్వాసాన్ని పెంచడంలో ఆధ్యాత్మిక సంస్థలు మౌన భాగస్వాములుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. చివరగా చిన్మయ మిషన్ 75 ఏళ్ల ప్రస్థానానికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

నాంపల్లి అగ్నిప్రమాదం అత్యంత విషాదకరం

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 25: నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ మాల్‌లో శనివారం జరిగిన భారీ అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ ఘటనలో ఐదుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందనకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలిందని, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన నియంత్రణ చర్యలు అమలు చేస్తామని తెలిపారు.

పాత కాపులను పాతర పెట్టండి...కాంగ్రెస్ కు పట్టం కట్టండి

- వార్డుల అభివృద్ధి నా బాధ్యత
- వచ్చే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓట్లేయండి
- గత రెండేళ్లుగా పట్టణాభివృద్ధికి చర్యలు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఆదివారం పట్టణంలో సుడిగాలి పర్యటన
- సీసీరోడ్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధికి శంఖుస్థాపన



ప్రతిపక్షం, షాద్ నగర్, జనవరి 25: గత పదేళ్లు షాద్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోని పాత కాపులకు పాతర వేసి, వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టణ ప్రజలను కోరారు. ఆదివారం ఉదయం నుంచి మున్సిపాలిటీలోని పలు వార్డులలో అభివృద్ధి, పౌరసేవల కల్పనకు శంఖుస్థాపనలు చేశారు. 7వ వార్డులోని తిరుమల మెగాటౌన్ షిప్ 40పీట్ల రోడ్డును సీసీ రోడ్డుగా, హైటెక్ , సూర్య కాలనీలో మురుగునీటి కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తిరుమల మెగాటౌన్ షిప్ లో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా చేశారని, దీనికి ప్రజల రుణం తీసుకునే బాధ్యత నాపై ఉందన్నారు. ఇందులో భాగంగానే గత రెండేళ్లుగా షాద్ నగర్ మున్సిపాలిటీని రంగారెడ్డి జిల్లాలోనే నెంబర్ వన్ గా తీసుకపోయేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. గతంలో పదేళ్లు పాలించిన పాలకులు పట్టణ అభివృద్ధిని పట్టించుకోలేదని, వార్డులలో గెలిచిన వారు ప్రజల నుంచి డబ్బులు దండుకున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి షాద్ నగర్ మున్సిపాలిటీ రూపురేఖలు మార్చే విధంగా కంకణం కట్టుకొని పనిచేస్తున్నాని తెలిపారు. చౌరస్తా నుంచి అన్నారం చౌరస్తా వరకు నాలుగు వరసల రోడ్డు నిర్మాణంతో పాటు పట్టణంలో నడిచేందుకు వీలులేని రహదారులను సీసీ రోడ్లుగా నిర్మించిన దృశ్యాలు ప్రజల కళ్లముందు కనిపిస్తున్నాయని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించండి..

మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉంటూ తనకు తోడుగా ఉండే వారిని గెలిపిస్తే కాలనీలను అభివృదధి చేసే బాధ్యత తీను తీసుకుంటానని తెలిపారు. 7వ వార్డులో యువకులు ప్రవీన్ ను గెలిపించాలని 7వ వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటామని, మా కాలనీని అభివృద్ధి చేయాలంటూ ఎమ్మెల్యేను కోరడం కనిపించింది. తిరుమల మెఘా టౌన్ షిప్ లో అంగన్ వాడీ కేంద్రం, అలాగే ఇంటినెం.18.209,2,46 నుంచి రత్నయ్య టీచర్ ఇంటి వరకు సీసీ రోడ్డు, హాజీపల్లి రోడ్ నుంచి మెగాటౌన్ షిప్ రోడ్డు కనెక్టివిటీ, రెండు పార్కుల అభివృద్ధితో పాటు అయ్యప్ప కాలనీ రహదారి అక్రమాల నుంచి తొలగించాలని కాలనీ సంక్షేమ సంఘం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. వీటన్నింటిని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, పార్టీ నేతలు తిరుపతిరెడ్డి, బస్వంతో పాటు 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఇంచార్జీ ప్రవీన్ కుమార్ పాల్గొన్నారు. కాలనీ వాసులు రాయల్ రాజు, సురేందర్, జయరాం, జంగయ్య, నరేశ్ , సీనియర్ జర్నలిస్టులు గుర్రంపల్లి మాణిక్యప్రభు, లక్కాకుల కిరన్ కుమార్, హన్మంతు, నర్సింహా, బొట్టురమేశ్, సిటీ కేబుల్ రవితో పాటు కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శంకుస్థాపనలు ఇలా...

ఆదివారం రూ.6.75 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మొత్తం 10 వార్డులలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. సీసీ రోడ్లు, అంతర్గత కాలువల పనులు ఇందులో ఉన్నాయి. వార్డుల వారీగా తీసుకుంటే పట్టణంలోని 27వ వార్డులో రూ. 60 లక్షలు, 15వ వార్డులో 25 లక్షలు, నాలుగవ వార్డులో 50 లక్షలు, 18వ వార్డులో 50 లక్షలు, 17వ వార్డులో 25 లక్షలు, 19వ వార్డులో 25 లక్షలు, ఏడవ వార్డులో కోటి రూపాయలు, 8వ వార్డులో 40 లక్షలు, పదవ వార్డులో కోటి రూపాయలు, ఒకటో వార్డులో 50 లక్షలు వెచ్చించి ఈ పనులను చేపడుతున్నాడు. 7వ వార్డులో సీసీ రోడ్డు, సూర్య, హైటెక్ కాలనీలో భూగర్భ మురుగునీటి కాల్వల పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఇంకెన్నాళ్లు దాడులు.. న్యాయం చేయరా?

- తమ గోడు వినిపించిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులు
- డీబీఎఫ్ అధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై బహిరంగ విచారణ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 25: ఎస్సీ, ఎస్టీలమైన పాపానికి మా దాడులు ఇంకెన్నాళ్ళు అని ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితులు తమ గోడు వినిపించారు. అదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జాతీయ ప్రజా ఉద్యమాల వేదిక, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) అధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ అత్యాచారా నిరోధక చట్టం అమలు పై ప్రజా బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ విచారణ డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, అశాలత, మీరా సంఘమిత్ర అధ్యక్షతన జరిగింది. బహిరంగ విచారణలో రాష్ట్రంలో ని 30 జిల్లాల నుండి బాధితులు హజరై తమ వేదనను వినిపించారు. నేటికి తెలంగాణ లో దళితుల సామాజిక బహిష్కరణ లు చెస్తున్నారని బాధితుల అందోళన వ్యక్తం చేశారు. ఓటు వేయకపోతే నా ఇల్లు కూల్చి చేశారని సంగారెడ్డి జిల్లా సజ్జాపూర్ కు చెందిన బ్యాగరి రాములు చెప్పారు. తమకు పట్టాలు ఇవ్వకుండా అటవి శాఖ అధికారులు అడ్డుకుంటూ వెధిస్తున్నారని మంచిర్యాల కు చెందిన అదివాసి పోషవ్వ అవెదన వ్యక్తం చేశారు. దళిత గిరిజనుల పై దాడులు జరిగిన ఎవరు పట్టించుకొవడం లేదని నిందితులను అరెస్ట్ చేయడం లేదన్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ,పునసరవసం కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వివక్షత కొనసాగుతుందన్నారు. ముఖ్య మంత్రి అధ్యక్షతన హైపవర్ కమిటీ ఏర్పాడు చేసీ దాడులను ఆరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ విచారణలో ఏడుగురు సభ్యలు సభ్యుల జ్యూరీ పబ్లిక్ హియరింగ్ తెలంగాణలో జిల్లాల నుండి దళిత, ఆదివాసీ బాధితులను విన్నది. గణతంత్ర దినోత్సవం సందర్భాన, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ క్షేత్రస్థాయి సంస్థల సంఘీభావంతో హైదరాబాద్‌లో ఒక రోజు పాటు పబ్లిక్ హియరింగ్ నిర్వహించింది. గత దశాబ్దంలో తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ 1989 అమలు స్థితిని సమీక్షించడానికి ఇది జరిగింది. ప్రతిష్ఠాత్మక 7 సభ్యుల జ్యూరీ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి దళితులు మరియు ఆదివాసులపై జరిగిన అత్యాచారాల బాధితుల సాక్ష్యాలను విన్నది. సంస్థాగత కమిటీ ద్వారా హియరింగ్ కోసం వివిధ జిల్లాల నుండి సుమారు 90 కేసులను సేకరించి విశ్లేషించారు. వీటిలో 22 జిల్లాలను ప్రాతినిధ్యం వహించే బాధితులు 30 కేసులను జ్యూరీ ముందు ప్రదర్శించారు. జ్యూరీ ముందు సాక్ష్యమిచ్చిన బాధితులు భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, మంచిర్యాల, వరంగల్, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల్, నిర్మల్, ఆదిలాబాద్, అసిఫాబాద్, మెదక్, సిద్దిపేట్, రంగారెడ్డి, హైదరాబాద్, కరీంనగర్, కామారెడ్డి, మెద్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ మరియు ఇతర జిల్లాల నుండి వచ్చారు.

గతం గతహా.. ఇప్పుడు కలిసి అభివృద్ధి చేద్దాం

- మైనార్టీ సంక్షేమ మంత్రి అజాహరుద్దీన్
- జహంగీర్ పీర్ దర్గాను దర్శించుకున్న మంత్రి



ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 25: చారిత్రాత్మకమైన హజరత్ జహంగీర్ పీర్ దర్గా ఎంతో పవిత్రమైందని, ఇక్కడికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇక్కడి అభివృద్ధి గతం ప్రస్తావన లేకుండా జరగబోయేది చేసుకుంటూ చక్కగా అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం హజరత్ జహంగీర్ పీర్ దర్గాను ఆయన సందర్శించుకున్నారు. పటాన్ చెరువు కాంగ్రెస్ నాయకుడు రామ్మోహన్ న్యాజ్ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అదేవిధంగా షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలతో కలిసి బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తో కలిసి దర్శించుకోవడం జరిగిందని ఇక్కడ అభివృద్ధి గురించి అసెంబ్లీలో పలు సందర్భాల్లో తనకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకరన్న కోరుకున్న విధంగా ఇక్కడ అభివృద్ధి జరుగుతుందని గతంలో ఏం జరిగిందో తనకు తెలియదని ఇప్పుడు కొత్తగా అభివృద్ధిని మొదలు పెడదామని మంత్రి అజహరుద్దీన్ అన్నారు. భక్తులు ఎన్నో కోర్కెలతో బాబా వద్దకు వచ్చి ముక్కులు చెల్లించుకుంటానని వారందరికీ శుభం జరుగుతుందని తాను కూడా మొదటిసారి ఇక్కడికి రావడం జరిగిందని ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే శంకర్ అన్న ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారని ఆయన ఎప్పుడూ ఇక్కడ పోటీ చేసిన గెలిపించాలంటూ మంత్రి విజ్ఞప్తి చేయడం విశేషం. ఎమ్మెల్యే శంకరన్న కోరుకున్న విధంగా దర్గాను అభివృద్ధి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రిని పలువురు భక్తులతో పాటు స్థానికులు ఘనంగా సన్మానించారు.

చెరువుల రక్షణలో హైడ్రా దూకుడు తగ్గదు

- పేదల గృహాలను కూల్చే ఉద్దేశం హైడ్రాకు లేదు
- పేదలను ముందు పెట్టి కబ్జాలకు పాల్పడే పెద్దలను వదిలిపెట్టం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి
- హరిత చైతన్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో సింగరేణి మాజీ ఉద్యోగుల సమ్మేళనం



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 25: చెరువుల పరిరక్షణలో హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఆక్రమణలను అడ్డుకోవటమే కాదు వాటిని ఆరోగ్యకరమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామన్నారు. చెరువులు ఇకపై పిల్లలకు యువతకు పెద్దల ఆరోగ్యానికి క్రీడలకు ఆలవాలంగా మారుస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, చెరువుల అక్రమణుల తొలగింపులు హైడ్రా ఇక ముందు కూడా దూకుడుగానే ముందుకు పోతుందని అన్నారు పేదల ఇళ్లను హైడ్రా కూల్చదని అదే సమయంలో పేదలను ముందు పెట్టి ఆక్రమణలు చేసే పెద్దలను వదిలిపెట్టే సమస్య లేదని హైడ్రా కమిషనర్ ఏవి. రంగనాథ్ స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాదులో రెడ్ హిల్స్ లో హరిత చైతన్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి మాజీ ఉద్యోగుల సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో ఆక్రమణలు తొలగింపు ఒకటే తమ లక్ష్యం కాదని, విషతుల్యంగా మారిన చెరువులను శుభ్రపరుస్తున్నామని, తద్వారా గుర్రపు డెక్క వంటి చెట్లు మొలవకుండా శుభ్రమైన నీరు చెరువులో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. అంతేకాక చెరువుల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని వాకింగ్ ట్రాక్లుగా చిన్న పిల్లలు యువత ఆడుకునే క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని చెరువులను ఈ విధంగా రూపుదిద్దామని మరికొన్ని చెరువులను త్వరలో చేపడుతున్నామన్నారు . ఇప్పటివరకు హైడ్రా అనేక ఆక్రమణలు తొలగించి వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ ఆస్తులను రక్షించిందని చెప్పారు. ఈ ఏడాది సుమారు 2000 ఎకరాల ఆక్రమణలను తొలగించి రూ . లక్ష కోట్ల ఆస్తులను కాపాడాలని లక్ష్యంతో ఉన్నామన్నారు. తొలగించాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సింగరేణి మాజీ ఉద్యోగులు ఈ విధంగా హరిత చైతన్య కళాక్షేత్రం పేరుతో పర్యావరణహితానికి తోడ్పడడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇదే సమావేశంలో పాల్గొన్న కేంద్ర పర్యావరణ అటవీ శాఖ అడ్వైజర్, సీనియర్ సైంటిస్ట్ శ్రీ తరుణ్ కత్తుల మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించేదిగా ఉంటే పరిశ్రమలకు గాని గనులు తవ్వడానికి గాని అనుమతులు ఇవ్వడం లేదన్నారు. తీవ్ర వాతావరణ కాలుష్యంతో బాధపడుతున్న విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు తమ వంతు బాధ్యతగా ముందుకు కదలాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ మాజీ డైరెక్టర్లు జేవీ దత్తాత్రేయులు, ఏ. మనోహర్, ఎస్. చంద్రశేఖర్, జీవీ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. హరిత చైతన్య కళాక్షేత్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు గణాశంకర్ పూజారి తమ సంస్థ ఉద్దేశాలను వివరిస్తూ పాటల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పర్యావరణ చైతన్యం తీసుకురావడం కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరి అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.



ఎన్నికల నోటిఫికేషన్లు తప్ప, ఉద్యోగాల నోటిఫికేషన్లు ఏవీ?

- రాజకీయ నిరుద్యోగులపై ఉన్న ప్రేమ, నిరుద్యోగ విద్యార్థులపై ఏది?
- ఉద్యోగ నోటిఫికేషన్ల సాధన కోసం ఈ నెల 31న హైదరాబాద్ లో నిరుద్యోగ గర్జన
- చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ లో జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 25: మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలి అంటే నిరుద్యోగుల జీవితాల్లో మార్పు వస్తదని నమ్మి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కిస్తే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపిస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాదులోని బీసీ భవన్ లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి తక్షణమే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న నిరుద్యోగ సింహ గర్జన వాల్ పోస్టర్ ను విద్యార్థి జేఏసీ నేత మోతిలాల్ నాయక్ గుజ్జ కృష్ణతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ వన్ గ్రూప్ టూ గ్రూప్ త్రీ డీఎస్సీ మరియు ఇంజనీర్ తదితర పోస్టులలో భర్తీ చేయడానికి నోటిఫికేషన్ లు విడుదల చేయకపోవడం చాలా అన్యాయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సామా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రతి సంవత్సరం ఉద్యోగ జాబ్ క్యాలెండర్ ను విడుదల జేస్తామని విద్యార్థి నిరుద్యోగులకు మాట ఇచ్చి ఇప్పుడు తీరా అధికారంలో కూర్చున్న తర్వాత హామీలను విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఒకవైపు రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగులు ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుందని ఆయన హేద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తక్షణమే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలనే డిమాండ్తో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ మరియు నిరుద్యోగ జేఏసీ సంఘాలు ఈనెల 31వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్ నిరుద్యోగ సింహ గర్జన ఆందోళన కార్యక్రమానీ కి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, గూడూరు భాస్కర్, వినోద్ అనిల్ ఆకాష్ భాష తండు రమేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



తన రికార్డులను కోహ్లీ బ్రేక్ చేసే ఛాన్స్ ఉందని సచిన్ గతంలో తనతో చెప్పారు. ఓ రోజు నేను సచిన్ ఇంటికి లంచ్‌కు వెళ్లాను. క్రికెట్‌లో మీరు చాలా రికార్డులు సృష్టించారని, వాటిని ఎవరు బ్రేక్ చేయగలరని సచిన్‌ను అడిగా. కోహ్లీకి ఆ సత్తా ఉందన్నారు. అన్ని ఫార్మాట్లలో సచిన్ 100 సెంచరీలు చేయగా, కోహ్లీ ఇప్పటి వరకు 85 శతకాలు బాదారు.

- బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా

బహుళ

సమీక్ష

రెప్పల వెన్నెలలో వలసగీతలు




గాజోజి శ్రీనివాస్
9948483560.

జాబేర్ పాషా కవిత్వంలో ప్రతి పదం మనసుకు దగ్గరగా ఉంటుంది. ఉత్తర తెలంగాణలో చూసినట్లయితే బతుకు తెరువు కొరకు దాదాపుగా ప్రతి ఇంటి నుండి ఒక వ్యక్తి గల్ఫ్ దేశాల బాట పడతాడు. కుటుంబ రక్షణకై పొట్ట చేత పట్టుకొని వలస వెళ్లిన జీవితాల గమనాలను ఈ పుస్తకంలో మనం చూడవచ్చు. వలస, ఊరు, కుటుంబం, స్నేహం, దేశభక్తి మొత్తం ఆయన కవిత్వంలోని ముఖ్య అంశాలు. పెద్ద అలంకారాలు లేకపోయినా, పదాల సరళత, భావాల లోతు, రూపకాల సహజత్వం వలన కవిత చదివేవారి మనసు వెంటనే కనెక్ట్ అవుతుంది. కవి ఇక్కడ తాను నడిచొచ్చిన దారుల్ని, గుండెల్లో నింపుకున్న బాధల్ని, కళ్ళనుండి కార్చిన కన్నీళ్ళను, బంధాలు, బంధుత్వాలు, స్నేహాన్ని, వివక్షని తన అక్షరాలలో పొందుపరిచాడు.

'అగరు ధూపం ఊదు పొగ' కవితలో కవి ఒకప్పుడు మన మధ్య ఉన్న స్నేహాన్ని, కలిసిమెలసి గడిపిన రోజుల మధుర జ్ఞాపకాలను సున్నితంగా గుర్తుచేస్తాడు. "అగరు ధూపం ఊదు పొగలు మిళితమైన పరిమళం" అనే ప్రతీక ద్వారా అప్పటి అనుబంధం, సహజ స్నేహం, హృదయానికి దగ్గరగా నిలిచిన ఆత్మీయతను వ్యక్తం చేస్తాడు. అయితే "ఇప్పుడా గుంజకు చెదలు పట్టింది" అనే వాక్యంలో కాలక్రమంలో చెదిరిపోయిన సంబంధాల వేదన స్పష్టంగా కనిపిస్తుంది.

'సిద్దిపేట్ టూ మస్కట్ వయా హైదరాబాద్' కవితలో వలసవెళ్లిన వారి లోపలి వేదన, వియోగభావం, కుటుంబం-స్నేహం మధ్య ఇరుక్కున్న అసహనం స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. "కాలు ఇంట్లో ఉంటే కడుపాకలి తీరదు / రెక్క విప్పుకున్న మరుక్షణం కంటతడి ఆరదు" అనే పాదాలు వలస జీవితం ఎంత కఠినమో, జీవనావసరాలు-భావోద్వేగాల మధ్య జరిగే సంఘర్షణను హృదయానికి తాకేలా చెబుతాయి. చంటి బిడ్డ, తల్లి, భార్య, తండ్రి వంటి బంధాలన్నీ వలస వెనుక దాగి ఉన్న మౌన వేదనకు, గుండె నిండిన భావాలకు ప్రతీకలుగా నిలుస్తాయి. "నావి కాని రెక్కల్ని తొడుక్కున్నప్పుడల్లా దేహమొక దుఃఖ మేఘం" అనే రూపకం వలస జీవితాన్ని ఒక నిరంతర వియోగయాత్రగా ఆవిష్కరిస్తుంది. చివరికి జీవితం తాత్కాలికమనే సత్యం, ఆశ-విరహం, ఎదురుచూపు, ప్రేమ-వేదనల కలయికగా ఈ కవితలో దర్శనమిస్తుంది. "ఏడుస్తున్న పిల్లాడిని భుజం మార్చి ఎత్తుకున్నట్టు ఒక్కో జామూ నీ దుఃఖాన్ని వంతులుగా మోస్తుంటాయి" అనే పోలిక వేదనను అత్యంత సహజంగా, నిశ్శబ్దంగా వ్యక్తం చేస్తుంది. చివరి పాదమైన "నాలుగు భుజాల సాయం ఆరడుగుల నివాసం" మన అహంకారానికి, పేరుప్రతిష్టలకు ఒక శాంతమైన, లోతైన ముగింపును సూచిస్తుంది.

'కపట కపోతం' కవితలో కవి మతం, రాజకీయాలు, స్వార్థవాదం, అవకాశవాదాన్ని పావురం ప్రతీకగా ఆవిష్కరిస్తూ తీవ్ర వ్యంగ్యాన్ని సృష్టిస్తాడు. "నేనేసిన గింజ తిని... నాపైనే రెట్ట వేసింది" అనే పాదం ఉపకారం చేసినవాడికే అవమానం తిరిగి వస్తే కలిగే వేదనను బలంగా చూపిస్తుంది. 'గుడి మసీదు చర్చి పైన' అనే మాటల ద్వారా మతాల పేరుతో మారువేషాలు వేసుకుంటూ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకునే మనస్తత్వాన్ని కవి బహిర్గతం చేస్తాడు. "తెల్లని రెక్కలు చూపి గింజలన్ని ఏరుకుని మరోమారు కనుమరుగైపోతుందా" అన్న చోట అవసరానికి దగ్గరవడం, అవసరం తీరగానే మాయమవడం వంటి అవకాశవాద ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది. పచ్చని చెట్టును తగలబెట్టడం, "చలి మంటల కాపు రుచి" వంటి ప్రతీకల ద్వారా విధ్వంసం చేసి లాభం పొందే అమానుష స్వభావాన్ని



కూడా కవి ఎత్తిచూపాడు. చివరగా "పావురం కాదది ముదిరిన తొండ... చేపల చెరువుకు కాపలా కొంగ" అనే రూపకం ఈ కవితకు గట్టి వ్యంగ్య బలాన్ని ఇచ్చి, వేషాల వెనుక దాగి ఉన్న అసలైన ముఖాన్ని పాఠకుడికి స్పష్టంగా చూపిస్తుంది

"ఊరి యాది" కవితలో పరదేశంలో ఉన్న మనిషి గుండెల్లో ఉబికి వచ్చే ఊరి జ్ఞాపకాల మత్తును కవి అత్యంత సహజంగా, సున్నితంగా పట్టుకున్నాడు. "పట్టపగలో మిట్టమధ్యాహ్నమో ఏ అర్థరాత్రో... నాలో నిద్రాణమైన జ్ఞాపకాలు మత్తుగా లేస్తాయి" అనే పాదాల ద్వారా ఊరు గుర్తొచ్చే క్షణాల అనూహ్యతను, జ్ఞాపకాల అకస్మాత్తు ప్రవాహాన్ని వ్యక్తం చేస్తాడు. "మోయతుమ్మెద వాగులో మునకేసిన తడారని జ్ఞాపకం", "రావిచెట్టు నీడలో రచ్చబండపై పరాష్కమాడిన దోస్తుల యాది" వంటి దృశ్యాలు ఊరిని కేవలం ఒక భౌగోళిక స్థలంగా కాక, అనుభూతిగా, జీవించిన జ్ఞాపకాల సమాహారంగా నిలబెడతాయి. "పీర్ల పండుగ", "ఉగాది పచ్చడి - ఈద్ సేమ్యా" వంటి ప్రతీకలు మా పురం కలిసిమెలిసిన సంస్కృతికి బలమైన గుర్తులుగా కనిపిస్తాయి. ముఖ్యంగా "ఊరును మరిచిన పరాయిని... ఊరు మాత్రం నన్ను మరవని కన్నతల్లి" అనే భావన వలసవాడి అంతర్లీన వేదనను, ఊరుతో ఉన్న విడదీయలేని బంధాన్ని హృదయాన్ని తాకేలా చెప్తుతుంది. ఈ కవిత ఊరంటే ఏమిటో పాఠకుడికి మళ్లీ గుర్తు చేస్తూ హృదయానికి దగ్గరయ్యే కవితగా నిలుస్తుంది.

"నాపై ఎందుకీ కక్ష?" అనే ఈ కవిత ఒక పౌరుడి ఆర్తనాదంగా, తన దేశానికి తనకున్న హక్కును ప్రశ్నించబడుతున్న ఒక సాధారణ మనిషి బాధగా నిలుస్తుంది. "భారతదేశం నా మాతృభూమి అని గొంతు చించి అరుస్తున్నా వాళ్లకు వినపడట్లేదా?" అనే ప్రశ్నతోనే కవి ఎదుర్కొంటున్న అవమానం, నిరాకరణ సూటిగా వ్యక్తమవుతుంది. "నా దేశాన్ని ప్రేమిస్తున్నాను... గుండెల్లో జై హింద్ నినాదాన్ని మారుమోగిస్తున్నా" అని చెప్పినా, "నా దేశభక్తిపై గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నరు" అన్న చోట దేశభక్తినే అనుమానంగా మార్చిన వాతావరణం స్పష్టంగా కనిపిస్తుంది. "దస్తావేజులు తేవాలట... బుల్డోజర్లు కావాలట" అనే పాదాలు అధికార దౌర్జన్యాన్ని, మతం పేరుతో జరిగే వేధింపులను బలంగా చూపిస్తాయి. పండ్లు అమ్ముకునే వాడిగా, మెకానిక్‌గా, బేకరీ లో పని చేసే వాడిగా తనను తాను పరిచయం చేసుకోవడం ద్వారా కవి తాను ఒక సాధారణ జీవితం గడిపే మనిషినే అన్న సత్యాన్ని గుర్తు చేస్తాడు. చివరగా "మండూకమై చిక్కి మరణించడం కాదు... ముంగిసలా మారి ప్రతిఘటిద్దాం" అనే పిలుపు ఈ కవితను ధైర్యమైన ప్రతిఘటనగా మార్చుతుంది.

"గల్ఫ్ బ్రతుకులు" కవితలో వలస జీవుల దైనందిన కష్టాలు, ఒంటరితనం, నిరీక్షణ, దూరం, అలసట, భయం స్పష్టంగా నేరుగా హృదయాన్ని తాకేలా ఆవిష్కరిస్తాడు. "సాపాటు మెతుకుల కోసం మేము పడే ఆరాటం", "ఎడారి దేశాల్లో పడే పాట్లు" అనే పాదాల ద్వారా గల్ఫ్‌కు వెళ్లినవారి జీవితం ఎంత కఠినమో మొదటినుంచే స్పష్టమవుతుంది. "పండగ పబ్బం ఉండదు వలసజీవి బతుకులల్ల" అన్న మాట కుటుంబానికి, ఊరికి దూరమైన బాధను గాఢంగా వ్యక్తం చేస్తుంది. అలాగే "అరేబియా సముద్రానికి అటువైపు మీరు... ఇటువైపు మేమున్నాము" అనే పాదాలు భౌగోళిక దూరాన్ని మించి, అనుభూతుల మధ్య ఉన్న అంతరాన్ని హృదయానికి తాకేలా చూపిస్తాయి. మూడో భాగంలో "ఉండటానికి మనసొప్పదు పోవటానికి ధైర్యం చాలదు" అన్న వాక్యం గల్ఫ్ జీవితం లోని అసలు సంక్షోభాన్ని చూపెడుతుంది; ఏజెంట్ల మోసాలు, జీతాలు రాని నెలలు వంటి అంశాలు కవితను నిజ జీవితానికి మరింత దగ్గరగా నిలబెడతాయి. చివరగా "గల్ఫ్ అనే చెరసాలలో వలసజీవులం మేం బందీలం" అనే పాదం ఈ కవితకు గుండె బరువైన ముగింపునిస్తూ, వలస జీవనపు నిర్బంధాన్ని బలంగా ముద్రిస్తుంది.

ఈ కవితలన్నీ కలిసి జాబేర్ పాషా కవిత్వాన్ని వ్యక్తిగత అనుభవాల పరిమితిలోనే కాక, సమాజపు సమిష్టి వేదనగా నిలబెడతాయి. సరళమైన భాష, సహజ రూపకాలు, లోతైన భావాలు ఆయన కవిత్వానికి బలంగా మారి, పాఠకుడి మనసును ఆలోచనలో ముంచెత్తుతాయి. వలస జీవుల జీవితాన్ని అర్థం చేసుకోవాలనుకునే వారికి మాత్రమే కాదు, సమకాలీన సమాజాన్ని గమనించాలనుకునే ప్రతి పాఠకుడికీ అవసరమైన పుస్తకం. భావోద్వేగం, సామాజిక స్పృహ, మానవీయ విలువలు సమపాళ్లలో కలిసిన "అగరు ధూపం ఊదు పొగ" కవితా సంకలనం జాబేర్ పాషాను ఒక బాధ్యతాయుతమైన కవిగా మరింత బలంగా నిలబెడుతుంది. చక్కటి కవితా సంకలనాన్ని అందించిన జాబేర్ పాషా గారికి హృదయపూర్వక అభినందనలు.

ఈ పుస్తకం కావలసిన వారు నవోదయ బుక్ హౌస్, న్యూ విశాలాంధ్ర బుక్ సెంటర్, లోగిలి బుక్స్ ద్వారా లేదా అమెజాన్‌లో పొందవచ్చు. వెల: ₹180/-. మరిన్ని వివరాలకు 95730 43596 నంబరును సంప్రదించవచ్చు.

పరిచయం

సుజాత భట్ అంతర్జాతీయ సాహిత్య తోటలో విరిసే మోదుగుపూవు



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

భారత సంతతికి చెందిన ఎందరో కవులు అంతర్జాతీయ సాహిత్యాన్ని గణనీయంగా రాస్తున్నారు. అలా కొలువుదీరిన కలాలలో సుజాత భట్, రూపీ కౌర్, నికితా గిల్, ఆఘా షాహిద్ అలీ వంటి ప్రఖ్యాత సాహితీవేత్తలు డయాస్పోరా, గుర్తింపు, సంస్కృతి సంబంధిత ఇతివృత్తాలను తమ అన్వేషణ, సృజనలో తీర్చిదిద్దున్నారు. వారు తరచుగా భారతీయ వారసత్వాన్ని ప్రపంచ దృక్పథాలతో అనుసంధానిస్తూ భారతీయ డయాస్పోరా, గుర్తింపు ఇతివృత్తాలను చిత్రిస్తున్నారు. ఆధునిక "ఇన్‌స్టా పోయెట్స్" తో సహా ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించే ఆంగ్ల కవిత్వం ద్వారా ప్రాముఖ్యతను పొందుతారు. అంతర్జాతీయ వేదికలో వారు చేసే అక్షర యజ్ఞంలో భారతీయ భాషాసంస్కృతుల మూలాలు విశేషంగా పెంచిపోషిస్తున్నారు. ఈ కవులు భారతీయ ప్రవాసుల నుండి వచ్చిన విభిన్న స్వరాలను ధ్వనిస్తు న్నారు, సాంప్రదాయ ప్రచురణ అట్లాగే డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా ప్రపంచ సాహిత్య చిత్రానికి కూడా దోహదపడడం తున్నారు.

ఇక గుజరాత్ లోని అహ్మదాబాద్ లో మే 6,1956లో జన్మించిన భారతీయ కవయిత్రి సుజాతా భట్ భాష, సాంస్కృతిక గుర్తింపు ఇంకా దయాస్పోరాను అన్వేషించడంలో ప్రసిద్ధి చెందిన ప్రఖ్యాత కవి. ప్రముఖ ప్రవాస గుజరాతీ సుమం సుజాత భట్ ను "జీవించి ఉన్న అత్యుత్తమ కవులలో ఒకరు" అంటూ వర్ణించింది న్యూ స్టేట్స్ మెన్ పత్రిక. అయితే ఆమె 1968 వరకు పూణేలోనే ఉన్నారు,తర్వాత ఆమె తన తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వలస వెళ్లారు. సుజాత అమెరికాలో చదువుకుంది, అక్కడ ఆమె అయోవా విశ్వవిద్యాలయం నుండి ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్ (MFA)పట్టా పొందింది. తర్వాత కెనడాలోని విక్టోరియా విశ్వవిద్యాలయంలో రచయితగా ఉండటానికి తన సాహితీయాత్రను ప్రారంభించింది. ఆమె మొదటి సంకలనం, బ్రూనిజెమ్, కామన్వెల్త్ కవితా బహుమతి (ఆసియా), మరియు ఆలిస్ హంట్ బార్ట్‌లెట్ అవార్డును గెలుచుకుంది. తదుపరి కవితా సంకలనానికి పుస్తక సంఘం సిఫార్సు లభించింది, 1991లో ఆమె చోల్మోండేలీ అవార్డును అందుకుంది. ఇప్పటి వరకు ఆమె కార్కనెట్ ప్రెస్‌తో ఆరు కవితా సంకలనాలను ప్రచురించింది. సుజాత భట్ తన భావోద్వేగాల చిత్రణ గురించి ఇలా "నేను ఒక కవిత రాయడంలో చాలా లోతుగా మునిగిపోయినప్పుడు నేను చిత్రాలను, శబ్దాలను, లయలను మరియు భావోద్వేగ 'స్వరాన్ని' పదాలుగా 'అనువదిస్తున్నట్లు' భావిస్తాను." అంటారు.

ఆమెకు ఇష్టమైన, ప్రముఖ కవితలలో కొన్ని మచ్చుకు... 'ఏ డిఫరెంట్ హిస్టరీ', 'సెర్చ్ ఫర్ మై టంగ్', 'నానాభాయ్ భట్ ఇన్ ప్రిజన్', 'ది స్టేర్' ఉన్నాయి. ఆమె ప్రస్తుతం ఫ్రీలాన్స్ రచయిత్రిగా పనిచేస్తున్నారు మరియు పెంగ్విన్ ఆంథాలజీ ఆఫ్ కాంటెంపరరీ ఇండియన్ ఉమెన్ పోయెట్స్ కోసం గుజరాతీ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. ఆమె కవితలు యునైటెడ్ కింగ్‌డమ్, ఐర్లాండ్, యునైటెడ్ స్టేట్స్ మరియు కెనడాలోని విభిన్న పత్రికలలో ప్రచురితమయ్యాయి మరియు విస్తృతంగా సంకలనం చేయబడ్డాయి.అట్లాగే బ్రిటిష్, జర్మన్, మరి డచ్ రేడియోలలో ప్రసారం చేయబడ్డాయి. సుజాత భట్ కు భాష అంటే నాలుక, శరీరకంగా మాట్లాడే చర్య అని అర్థం." సుజాత గుజరాతీని మరియు ఆమెకు



బంధించిన భారతీయ బాల్యాన్నీ "నా గుర్తింపు యొక్క లోతైన పొర"గా చిత్రీకరించింది. కానీ భట్ ప్రతిరోజూ మాట్లాడే, ఎక్కువగా రాయడానికి ఎంచుకునే ఏకైక భాష మాత్రం ఇంగ్లీష్. మాతృభాష మాట్లాడే భారతీయ కవిగా పేరున్న సుజాత భట్ సాధారణంగా తన కవితలలో చాలా వరకు ప్రేమ, మరియు హింస ఇతివృత్తాలు ఉంటాయి. ఆమె కవిత్వంలోని ఇతివృత్తం రాజకీయ కలహాల నుండి శృంగారవాదం వరకు ఉంటుంది. సుజాత భట్ ప్రస్తుతం జర్మనీలోని బ్రెమెన్‌లో తన భర్త, జర్మన్ రచయిత మైఖేల్ అగస్టిన్ మరియు ఆమె కుమార్తెతో నివసిస్తున్నారు. సుజాత భట్ రాసిన "ఎ డిఫరెంట్ హిస్టరీ" వలసరాజ్యానంతర గుర్తింపును అన్వేషిస్తుంది. ప్రకృతి, ఇంకా జ్ఞానం పట్ల భారతీయ సాంప్రదాయ గౌరవాన్ని బ్రిటిష్ వలసవాదులు ఆంగ్లాన్ని రుద్దడంతో విభేదిస్తుంది, అణచివేతదారుడి భాష భవిష్యత్ తరాల వారికి ఎలా ప్రియమైనదిగా మారుతుందో పరిశీలిస్తుంది. ఈ కవిత భారతీయ దేవతల (సరస్వతివంటి) చిత్రాలను మరియు వలసవాద కథనాలను ప్రశ్నించడానికి పవిత్ర స్థలాలను ఉపయోగిస్తుంది, భట్ తన గుజరాతీ మాతృభాష మరి ఆమె విద్య నేర్చిన భాష ఆంగ్లం మధ్య చిక్కుకున్న అనుభవాలను ప్రతిబింబిస్తుంది. కవిత సందర్భంగా ఆమె తొలి సేకరణ బ్రూనిజెం (1988)లో ప్రచురించబడింది. అమెరికాకు వెళ్లి ఇంగ్లీష్ నేర్చుకున్న భారతీయురాలిగా భట్ వ్యక్తిగత నేపథ్యాన్ని ప్రతిబింబిస్తుంది, ఆమె వారసత్వానికి మరి ఆమె స్వీకరించిన భాషకు మధ్య ఉన్న సంఘర్షణను అన్వేషిస్తుంది.

కవిత

నేను నమ్మిన ధర్మం

మనిషి దాచుకున్న రూపాయి
మనిషిని ధనవంతుడిని చేస్తుంది
కానీ మనిషి చేసిన దానం
మనల్ని ధర్మాత్మునిగా చేస్తుంది
డబ్బు దానం ఆస్తిపాస్తులు మనిషి కాటి వారికే
కానీ ధర్మం దైవం దగ్గరికి వెళ్లేంతవరకు
ఉపయోగపడుతుంది!
ధర్మంగా ఈ కలియుగంలో ఎన్ని ఆటలైనా ఆడుకో
కానీ ఆ ధర్మం వైపు మాత్రం కన్నెత్తి చూడకు
అది కత్తిపోటు కన్నా
మనిషి కర్మ పోటు చాలు తీవ్రంగా ఉంటుంది
అందుకే ఆ ధర్మం వైపు కన్నెత్తి
చూడకు కంటి పాపకు పాపం
పేద వాడిని దోచుకోకు ఆ పాపం
నీ తరతరాల వంశానికి వ్యాపిస్తుంది
ధర్మంతో ధైర్యంగా ఎంత పోరాటమైన చేయి మన
ధైర్యం ధైర్యంగా ధర్మం వైపు ముందుకు సాగటమే
మనిషి జీవితం అని గుర్తుంచుకో!!
మనిషిని మనిషిగా చూడడం నేర్చుకో
సాటి మనిషి దేవుడనేది తెలుసుకో
ప్రపంచంలో పగటికి సూర్యుడు
రాత్రికి చంద్రుడు ఉన్నట్టుగానే
మనిషికి ఒక ధర్మం ధైర్యం మంచి స్నేహితుడు
ఉంటాడని గుర్తించుకో
ఆత్మవిశ్వాసమే అన్ని విజయాలకు ముందడుగు!!
మనిషి వ్యక్తిత్వం వెలుగుతున్న దీపం అది పూరి గుడిసె
ల్లో అయినా ఇంద్ర భవనంలో అయినా ఒకే విధంగా
వెళుతూ ఉంటుంది
సిద్ధాంతాలను నమ్ముకున్నవాడు
తాత్కాలికంగా సుఖపడవచ్చు
కానీ సిద్ధాంతాలను నమ్మినవాడు కష్టపడి స్పష్టంగా
ప్రతి ప్రజల హృదయాలలో స్థానం పొందుతాడు!!
అద్దుగీత ల నిలువుగీతల ఈ సమాజంలో పిడికెడు
మెతుకుల కోసం నిత్య ఒక యజ్ఞం
బిడ్డల కన్నీళ్లు నిప్పుకొని కాలి కడుపుతో గాలిని
పీల్చుకుని ఈ చీకటి వెలుగులలో చీకట్లోనే జీవితాన్ని
జ్ఞాపకంగా అవినీతిపై యుద్ధం
కొనసాగిస్తున్న నిజాయితీపరుడు!!
కష్టకాలం కర్మ ఫలితం
మనిషి నమ్ముకున్న ఈ ధర్మం
తేనె తీపి కన్నా పాల సముద్రం కన్నా పాల మీగడ కన్నా
మనిషి స్వచ్ఛమైన ప్రేమ ఆప్యాయత అన్నిటికన్న
మిన్న అని గుర్తుంచుకో
ఈ ప్రజాస్వామ్య దేశంలో
కోట్లు సంపాదించేటోనికి
ఓట్లు అడుక్కునే వాడికి తప్ప
పేదవానికి రైతులకు ఎప్పటిక న్యాయం జరగదేమో
ఈ పవిత్ర భారత దేశంలో!!

కొమురవెల్లి
నరసింహులు
తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత
గ్రామం మర్పడగ
కొండపాక, సిద్దిపేట జిల్లా



విరామం

లోకానికి కనిపించేలా
పెదవులపై చిరునవ్వు
దోబూచులాడుతున్నా..
గాయపడిన హృదయం
దేహగోళంలో కాలుతూ
అంతరంగాన్ని అతలాకుతలం
చేస్తుంది

నీ అంతర్ధానం
నాలో ఆందోళన గీతమవుతుంది.
నువ్వు లేని ఈ లోకం
నాకు నరకప్రాయమే కదా!

కాలాలకేం పోయేకాలమో
ఋతువులన్నీ మౌనంగా
మారాం చేస్తున్నాయి.
మబ్బుల మాటున దాగి
చంద్రుని దోబూచులాట.
జ్ఞాపకాల దీపాలన్నీ
గాలి గాయానికి ఆరి పోయాయి
నీకూ నాకూ మధ్య
నిశీధి నిశ్శబ్దం!

నీకు విరామం కాబోలు
నాకిది విరహతాపం
ఈ కాయం కట్టెగా మారక ముందే
ఒక్కసారి వచ్చి ఓదార్చిపోవా చెలీ!

- ముక్కెర
సంపత్ కుమార్
హుస్నాబాద్,
సిద్దిపేట జిల్లా



సందర్భం

స్మృతి – రచయితకు మూలధనం



చిటికెన కిరణ్ కుమార్
9490841284

మనిషి జీవితం ఒక ప్రవాహంలాంటిది. ఆ ప్రవాహంలో నీరు ముందుకు సాగిపోతూ, తీరాలపై తన ఆనవాళ్లు వదిలిపోతుంది. అలాగే మనిషి జీవితం కూడా కాలప్రవాహంలో ముందుకు నడుస్తూ, కొన్ని క్షణాలను, కొన్ని అనుభూతులను మనసులో నిలిపివేస్తుంది. అవే స్మృతులు. అవి కనిపించవు, పట్టుకోలేము, కానీ అవే మన ఆలోచనలకు రూపం ఇస్తాయి. రచయిత మనసు కూడా ఇలానే ఉంటుంది—కాలం అనే నదిలో తేలుతూ వచ్చిన అనుభవాల నీటిని తనలో నిల్వ చేసుకుని, అవసరమైన వేళ అక్షరాలుగా పారబోస్తుంది. ఈ ప్రవాహాన్ని అర్థం చేసుకోకుండా రచనను అర్థం చేసుకోవడం కష్టం. నీరు ఎలా జీవానికి ఆధారమో, స్మృతి కూడా రచనకు అదే విధంగా ఆధారంగా నిలుస్తుంది. స్మృతి లేకుండా రచన అనే ఆలోచననే అసంపూర్ణం. మనిషి తనలో దాచుకున్న జ్ఞాపకాలే అతడి భాషకు ప్రాణం పోస్తాయి. ఒక రోజు చూసిన దృశ్యం, విన్న మాట, అనుభవించిన బాధ, తెలియకుండానే మనసులో నిలిచిపోయిన ఆనందపు చినుకులు—ఇవన్నీ కలిసే రచయితలో సృజనకు మూలధనంగా మారతాయి. కాగితంపై కనిపించే అక్షరాల వెనుక కనిపించని ఒక జీవంతమైన ప్రపంచం ఉంటుంది; ఆ ప్రపంచానికి ద్వారం స్మృతి. రచన అనేది కేవలం కల్పన మాత్రమే కాదు. కల్పన కూడా స్మృతుల నుంచే పుట్టుకొస్తుంది. మనం చూడని దృశ్యాన్ని కూడా, విన్న మాటల జ్ఞాపకాలతో, అనుభవాల నీడలతో నిర్మించగలగడం స్మృతివల్లే సాధ్యం. రచయిత తన జీవితాన్ని నేరుగా రాయకపోయినా, అతని రచనలో జీవితం తళుక్కుమంటుంది. ఎందుకంటే అతడి మనసులో నిలిచిన జ్ఞాపకాలు అక్షరాలుగా రూపాంతరం చెందుతాయి.

వ్యక్తిగత స్మృతి మొదట మనిషిని తాకుతుంది. బాల్యం, యౌవనం, మధ్య వయస్సు—ప్రతి దశ తనదైన ముద్రను మనసుపై వేస్తుంది. ఒక చిన్ననాటి అనుభవం, ఆ సమయంలో అర్థం కాకపోయినా, కాలం గడిచాక రచనలో లోతైన భావంగా మారుతుంది. అప్పట్లో ఒక



మాట బాధ పెట్టిందనుకోండి; అదే మాట ఏళ్ల తరువాత ఒక కథకు గుండెకాయలా మారుతుంది. వ్యక్తిగత స్మృతి ఇలానే రచనకు అంతర్లీన శక్తిని ఇస్తుంది.

అయితే రచయిత స్మృతి కేవలం వ్యక్తిగత స్థాయిలోనే ఆగిపోదు. సమూహ స్మృతి కూడా అతడి రచనను విస్తరిస్తుంది. ఒక కాలంలో సమాజం అనుభవించిన మార్పులు, ఆశలు, భయాలు, ఎదురుచూపులు—ఇవి అన్నీ సమూహ స్మృతిలో భాగం. రచయిత వాటిని ప్రత్యక్షంగా అనుభవించకపోయినా, కథలు, మాటలు, వాతావరణం ద్వారా తనలోకి తీసుకుంటాడు. అలా సమాజం తన జ్ఞాపకాలను రచయిత చేతుల్లోకి అప్పగిస్తుంది. సమూహ స్మృతి రచనలోకి వచ్చేటప్పుడు అది ఉపదేశంగా మారకూడదు. అది జీవితం లాగానే సహజంగా ప్రవహించాలి. ఒక కాలం యొక్క నాడిని పట్టుకుని, ఆ కాలంలో జీవించిన మనుషుల శ్వాసను వినిపించగలిగితేనే సాహిత్యం నిలబడుతుంది. రచయిత పని స్మృతిని నిల్వ చేయడం కాదు; దానిని జీవంగా మార్చడం.

స్మృతి అంటే కేవలం గతాన్ని తలచుకోవడం మాత్రమే కాదు. అది వర్తమానాన్ని అర్థం చేసుకునే సాధనం కూడా. గత అనుభవాల కాంతిలోనే మనం ఈ రోజు చూస్తాం, రేపటిని ఊహిస్తాం. రచయిత కూడా అంతే. అతని స్మృతి అతడికి దిశానిర్దేశం చేస్తుంది. ఏ విషయాన్ని ఎలా చెప్పాలి, ఏ మౌనాన్ని ఎక్కడ ఉంచాలి అనే నిర్ణయాలు స్మృతితోనే వస్తాయి.

కొన్ని స్మృతులు మధురంగా ఉంటాయి, కొన్ని బాధాకరంగా ఉంటాయి. రచయితకు రెండూ అవసరమే. మధుర స్మృతి రచనకు సౌందర్యాన్ని ఇస్తే, బాధాకరమైన స్మృతి లోతును ఇస్తుంది. బాధ లేకుండా రాసిన మాటలు పైపైనే ఉంటాయి. అదే బాధను దాటి వచ్చిన స్మృతి అక్షరాలకు బలం ఇస్తుంది. అందుకే గొప్ప రచనల్లో ఎక్కడో ఒక చోట మౌనమైన వేదన కనిపిస్తుంది.

స్మృతిని అక్షరాలుగా మార్చే ప్రక్రియ సులభం కాదు. ప్రతి జ్ఞాపకం వెంటనే రచనగా మారదు. కాలం, ఆలోచన, మౌనం ఈ మూడు కలిసి స్మృతిని శుద్ధి చేస్తాయి. అప్పుడే అది వ్యక్తిగత అనుభవం నుంచి సామూహిక అనుభూతిగా మారుతుంది. రచయిత తన స్మృతిని తనదిగా ఉంచుకుంటూనే, పాఠకుడికి చెందేలా చేయగలిగితేనే ఆ రచన జీవిస్తుంది.

ఈ కాలంలో వేగం పెరిగింది. సంఘటనలు వెంటనే మర్చిపోవడం అలవాటుగా మారింది. అలాంటి సమయంలో స్మృతిని నిలబెట్టే పని సాహిత్యమే చేస్తుంది. రచయిత తన జ్ఞాపకాలతో మాత్రమే కాదు, కాలం మరిచిపోతున్న జ్ఞాపకాలతో కూడా బాధ్యతగా వ్యవహరించాలి. అవి ఉపదేశంగా కాకుండా, కథగా, భావంగా, మానవీయ స్పర్శగా మారినప్పుడే పాఠకుడిని తాకుతాయి.

చెప్పుకోవాల్సింది ఒక్కటే. రచయితకు నిజమైన మూలధనం పేరు, ప్రతిష్ట, ప్రచారం కాదు. అతడి లోపల పేరుకుపోయిన స్మృతులే అతడి సంపద. వాటిని నిజాయితీగా వినియోగించగలిగినప్పుడు, ఆ రచన కాలాన్ని దాటి నిలబడుతుంది. స్మృతి నుంచి పుట్టిన అక్షరాలు మాత్రమే మరొక మనిషి స్మృతిలో స్థానం సంపాదించగలవు. అదే సాహిత్యానికి నిజమైన విజయము.

(వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు, ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసర్చ్ ఫోరం సభ్యులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008



ప్రాంతీయం

సూర్యదేవునికి సామూహిక నమస్కారాలు..

- వైభవంగా రథసప్తమి వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 25



చల్లటి గాలులు... చిరుజల సవ్వడులు .. లేలేత వెచ్చటి ఆదిత్య కిరణాలు... ఇలాంటి అద్భుత దృశ్యాల మధ్య ప్రపంచానికి ఆరోగ్యాన్ని పంచే సూర్యదేవునికి సామూహిక నమస్కారాలతో స్వాగతం పలికిన సన్నివేశాలు సిద్దిపేట కోమటి చెరువు రూబీ నెక్లెస్ పై ఆవిష్కృతమయ్యాయి. వ్యాస మహర్షి యోగ సొసైటీ , సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రముఖ యోగా గురువు, రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు తోట సతీష్ , సంధ్యల నేతృత్వంలో ఆదిత్య శ్లోకంతో కార్యక్రమం ప్రారంభమైంది. సూక్ష్మయోగ అనంతరం సూర్యుణ్ణి స్తుతిస్తూ లయబద్ధంగా సూర్య నమస్కారాలు సామూహికంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు, వాకర్స్ వేడుకలో పాల్గొని రథసప్తమి వేడుకలను వెలిగించారు.

భారతదేశం ప్రపంచానికి దిక్సూచి...

సామూహిక సూర్య నమస్కారాల అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి, ప్రముఖ వైద్యులు ప్రణీత్ మాట్లాడుతూ యోగా అంతర్గత, బహిర్గత కాలుష్యాలను దూరం చేస్తుందని చెప్పారు. యోగాను జీవితంలో భాగం చేసుకున్నవారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇతర క్రీడల్లో సామాగ్రి అవసరం ఉంటుందని యోగ అభ్యసనలో ఏలాంటి పరికరాలు లేకుండా సులభంగా యోగ సాధన చేసుకోవచ్చని సూచించారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలు, శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. నాలుగు లక్షల సూర్య నమస్కారాలతో నిర్వహించిన ఉత్సవం వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి నమోదైనట్టు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగ విద్య నేడు ప్రపంచానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. సిద్దిపేట అన్ని రంగాల్లో రాష్ట్ర , జాతీయస్థాయిలో అవార్డులను, రివార్డులను గెలుచుకున్నట్లే యోగా రంగంలో కూడా సిద్దిపేట నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి యువ క్రీడాకారులు ఎదుగుతున్నారని తెలిపారు. వివిధ సందర్భాల్లో ఇచ్చే బహుమతులు స్వల్ప కాలంగా ఉంటాయని , యోగ విద్యతో పొందిన ఆరోగ్యాన్ని బంధువులకు, మిత్రులకు అందజేయడం ద్వారా వారికి అద్భుతమైన కానుక ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. ప్రపంచంలో పెరుగుతున్న కాలుష్యాలను ఎదుర్కోవడానికి యోగ విద్య ఎంతో అవసరమని చెప్పారు. ఇది గత కరోనా సమయంలో నిరూపితమైందని పేర్కొన్నారు. సంస్కార భారతి అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ యోగమున్న వారికి మాత్రమే యోగ విద్య దక్కుతుందని, వారి వద్దకు రోగాలు రావని చెప్పారు. సిద్దిపేట ఖ్యాతిని పెంచుతున్న సిద్దిపేట జిల్లా యోగాసోసియేషన్, వ్యాస మహర్షి యోగ సొసైటీలను ఆమె అభినందించారు. మున్సిపల్ కౌన్సిలర్ సాయి మాట్లాడుతూ వివిధ రకాల ఒత్తిడి లను జయించడానికి యోగా ఉపయోగపడుతుందని తెలిపారు. యోగ అసోసియేషన్ చీఫ్ పాటర్న్ చిప్ప ప్రభాకర్ మాట్లాడుతూ యోగ సాధన వల్ల తాను ఆరోగ్యంగా ఉన్నానని, జాతీయస్థాయిలో పోటీ పడుతున్నానని తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొమరవెల్లి అంజయ్య, టీ ఎన్ జీ ఓ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డి, ఎస్ టి యు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్ , ప్రధాన కార్యదర్శి శ్రీధర్, టీ పి యు ఎస్ రాష్ట్ర బాధ్యులు శ్రీనాకర్ రెడ్డి, సంతోషిమాత దేవాలయం పూర్వ చైర్మన్ మంకాల నవీన్, పతంజలి యోగ సమితి చీఫ్ పాట్రన్ అంజయ్య , యోగ అసోసియేషన్ సభ్యులు బసవరాజు కుమార్ ,పల్లె సురేష్ , స్వామి ,ఆనంద్ తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- ఫ్యూజ్ వైర్ వేసేందుకు ట్రాన్స్ ఫార్మర్ బంద్ చేసిన రైతు
- జంపర్ విరిగి న్యూట్రల్ వైర్ పై పడడంతో విద్యుత్ షాక్

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 25:



సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటనలో నర్మెటకు చెందిన పొన్నాల(జామ చెట్టు) శ్రీనివాస్ రెడ్డి(55) అనే రైతు మరణించారు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ ఫ్యూజ్ వైర్ కొట్టి వేయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్ఫార్మర్ ఫ్యూజ్ వైర్ వేసేందుకు శ్రీనివాస్ రెడ్డి ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ట్రాన్స్ ఫార్మర్ ను బంద్ చేశాడు. బందు చేసే క్రమంలో జంపర్ విరిగి న్యూట్రల్ వైర్ పై పడింది. దీని ద్వారా బంద్ చేసేందుకు వినియోగించే హ్యాండిల్ కు విద్యుత్ సరఫరా కావడంతో శ్రీనివాసరెడ్డి విద్యుదాఘాతానికి గురయ్యాడు. రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరెడ్డికి భార్య అరుణ, కుమారుడు యాకూబ్ రెడ్డి, కూతురు ఝాన్సీరాణి ఉన్నారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు రాజగోపాలపేట ఎస్సై టి.వివేక్, పోలీస్ సిబ్బంది రంగారెడ్డితో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని పంచనామా చేసి శవ పరీక్ష నిమిత్తం మృత దేహాన్ని సిద్ధిపేటలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. విద్యుదాఘాతంతో రైతు మృతి చెందడంతో నర్మెటలో తీవ్ర విషాదం నెలకొంది.

సమ్మక్క జాతర మొక్కులు షురూ

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 25





మంచిర్యాల గోదావరి రోడ్డున గౌతమేశ్వర ఆలయం పుష్కర ఘాటు వద్ద ప్రతి రెండు ఏళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క సారక్క జాతర మొక్కలు ప్రారంభమయ్యాయి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సమ్మక్క సారలక్క జాతర హక్కులను చెల్లించుకుంటున్నారు ఒకవైపు మున్సిపల్ ఎండోమెంట్ కమిటీ సభ్యులు సమ్మక్క సారక్క జాతర జరిగే ప్రదేశాన్ని శుభ్రం చేస్తుండగా మరోవైపు భక్తులు సుదూర ప్రాంతం నుండి వస్తూ కోళ్లతో మేకలతో కొబ్బరికాలతో బెల్లం తో తమ మొక్కలను చెల్లించుకుంటున్నారు జాతర జరిగే సమ్మక్క సారక్క గద్దెలకు ఒకవైపు రంగులు దిద్దుతుండగా మరోవైపు మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేస్తుండగా ప్రశాంత వాతావరణంలో భక్తులు తమ మొక్కను చెల్లించుకుని ప్రార్థన చేస్తున్నారు ఈనెల 28 29 30తేదీలలో జరిగే జాతరకు వేలమంది భక్తులు ప్రారంభం కొంతమంది భక్తులు ఇప్పటినుండే ప్రశాంత వాతావరణంలో తమ మొక్కలను చెల్లించుకున్నట్టుగా చెప్పుకుంటున్నారు జాతర సమయంలో మంచిర్యాల బస్టాండ్ నుండి జాతర జరిగే స్థలం వరకు ఆర్టిసి బస్సులను నడిపించడం జరగనుంది ప్రస్తుతం భక్తులు రద్దీ లేని సమయంలో ఇప్పటి నుండి అనుమకులను ప్రారంభించారు

సిద్దిపేట మున్సిపల్‌లో బడ్జెట్ దారి మళ్లిస్తున్నారు..

- ప్రైవేట్ సంఘాలకు మిగులు బడ్జెట్ ఎందుకు
- ప్రారంభం కాని పనులకు మిగులు బడ్జెట్ కేటాయింపు ఎలా..?
- మైనారిటీ, దళితులపై చిన్నచూపు ఎందుకు...?
- కాంగ్రెస్ నాయకులు మహేందర్, సాకి ఆనంద్, రియాజ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 25:



సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు దారి మళ్లుతున్నాయని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు అలకుంట మహేందర్, సాకి ఆనంద్, కౌన్సిలర్ రియాజుద్దీన్ లు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యకుడు అత్తూ ఇమామ్ తో కలిసి మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీ లో ఇష్టరీతిగా బడ్జెట్ కేటాయింపులు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. పట్టణం లోని రెడ్డి సంక్షేమ సంఘంలో ఇప్పటికే ఫంక్షన్ లు చేయడం స్టార్ట్ అయ్యాయని కాని మున్సిపాలిటీ నుండి రూ 10లక్షలు మిగులు బడ్జెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అలాగే పట్టణంలోని 12 వార్డులో వ్యవసాయ క్షేత్రానికి రోడ్లు వేసుకోవడం సిగ్గు చేటన్నారు. కాలనిలో కొన్ని చోట్ల రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సొంత పొలానికి రోడ్లు వేయించుక్కవడం ప్రజల టాక్స్ ను దుర్వినియోగం చేయడమే అన్నారు. ఇప్పటికే మున్సిపల్ కి కోటి రూపాయల కరెంటు బిల్లు పెండింగ్ లో ఉందని. మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కయ్ ఆడుతున్నా నాటకాలని ఆరోపించారు.కోట్ల రూపాయలను పక్కదారి మళ్లిస్తున్నారన్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ను వెంటనే ట్రాన్సఫర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు సాకి ఆనంద్ మాట్లాడుతూ

మున్సిపల్ లో జెనరల్ ఫండ్ అనేది 43 వార్డుల్లో అభివృద్ధి పనులకు కేటీయించాలి... కాని గుళ్లకు. సంఘాలకు, మస్జీద్ లకు మేము వ్యతిరేకం కాదు కాని ఉద్దేశ్యం పూర్వకంగా కొన్ని సంఘాలకు నిధులు కేటీయించడం దారుణం అన్నారు. కుషాల్ నగర్ లో మాల స్మశానం వాటికకు ఒక్క రూపాయి నిధులు కేటీయించలేదని మండిపడ్డారు.. బీసీ, ఎస్సి ఎస్టీ ల గురించి ఆలోచన చేయడం లేదని మున్సిపల్ బడ్జెట్ అసలు కులం సంఘాలకు వాడకూడదన్నారు. ఎజెండా లో అంశాలు పెడుతూ ఎవరికి అర్థం కాకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు.. ఇలాంటి విషయాలపై కమిషనర్ కూడా వత్తాసు పలుకడం దారుణం అన్నారు. 43 వార్డు ప్రజల టాక్స్ అభివృద్ధి కి వాడాలి కాని సంఘాలకు వాడడం రాజ్యాంగ విరుద్ధం ఇది మీ జాగిరు కాదని స్పష్టం చేశారు. 20 వ వార్డు కౌన్సిలర్ రియాజ్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీ లు అంటే మున్సిపాలి వారికియ్ అంత చులకన అని ప్రశ్నించారు..నిధులన్నీ కోమటి చెరువుకు కేటాయిస్తూ మిగతా వాటిని విస్మరించడం తాగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మదీనా ఫంక్షన్ హాల్ కు 25 లక్షలు ఇస్తా మంజూరు చేస్తామని కేవలం 10 ఇచ్చిచేతులు దులుపుకున్నారు. సిద్దిపేట లో కోమటి చెరువు తప్ప మిగతా అభివృద్ధి కనిపించడం లేదని. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సిద్దిపేట మైనారిటీ ల జనాభా ఎక్కువగా ఉందని ఇక్కడి యువత కోచింగ్ ల పేరిట హైదరాబాద్ కు వెళ్లకుండా ఇక్కడే మైనారిటీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చెస్తానని తెలిపిన హరీష్‌రావు ఇచ్చినం వాగ్దానం ఏమి చేశారాని ప్రశ్నించారు. మైనారిటీ లు దళితులు అంటే చిన్నచూపు చూస్తున్నారని మండి పడ్డారు. పట్టణం లోని కొన్ని వార్డులకు మాత్రమే నిధులు కేటాయిస్తున్నారని వారికి అనుకూలం అయినా వార్డులకి మాత్రమే నిధులు కేటాయియించడం దారుణం అన్నారు.. మిగతా వార్డులపై ఎందుకంత వివక్ష అన్నారు.

రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం

ప్రతిపక్షం సిద్దిపేట, జనవరి 25:



రాజకీయాలలో గెలుపులు ఓటములు సహజంగానే ఉంటాయని సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ముదిరాజ్ సంఘం నాయకులు కొత్త ఎల్లం కొత్త శ్రీకాంత్ లు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటమి చెందిన గ్రామంలోని వార్డు సభ్యులకు ఆదివారం గ్రామ పెద్దమ్మ దేవాలయం వద్ద సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరూ గెలిచిన అభ్యర్థులకు సన్మానాలు నిర్వహిస్తే ఓడిన అభ్యర్థులకు సన్మానాలు నిర్వహించి మనోధైర్యాన్ని కల్పించడం పట్ల పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

చిత్తరమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, జనవరి 25 :



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం గల శ్రీశ్రీశ్రీ చిత్తరమ్మ దేవి జాతరలో ఆదివారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్తరమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ చిత్తరమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారు చేసిన ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు. అనంతరం ఆలయ కమిటీ వారు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, సలహాదారు కూన శ్రీనివాస్ గౌడ్, ఇతర సభ్యులు బాలరాజు, నరసింహ, ఇంద్రసేన గుప్తా, బుచ్చిరెడ్డి, పెంట రెడ్డి, గౌరిశెట్టి శివ, సత్తయ్య ఇంద్రసేనా రెడ్డి, స్థానిక డివిజన్ నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 25 :


గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు .జిల్లా కేంద్రంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆదివారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి లతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని, స్టేజి, మైకూ, పార్కింగ్,సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, త్రాగు నీరు, విద్యుత్,శకటాల ప్రదర్శన,వందన సమర్పణ,ఉపన్యాసం ,చివరగా ముగింపు వరకు వీక్షకులకు, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

సాగునీటి విడుదలకు హరీష్ రావు విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 25:



రైతులు నాట్లు వేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌ల నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ అంజాద్ హుస్సేన్‌లను కోరారు. ఆదివారం ఉదయం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్సీ అంజాద్ హుస్సేన్‌లకు ఫోన్ చేసిన హరీష్ రావు, రైతులు ఆందోళనలో ఉన్నారని, నాట్లు వేసి నీటి కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు. సాగునీటి కొరత వల్ల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.ఇదే అంశంపై నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. మరోసారి ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితి తీవ్రతను వివరించిన హరీష్ రావు, వెంటనే నీటి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హరీష్‌రావు చేసిన విజ్ఞప్తికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్సీ అంజాద్ హుస్సేన్ సానుకూలంగా స్పందించి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌ల నుంచి నీటి విడుదలకు అంగీకరించినట్లు తెలిపారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 25;

సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. జి. జీవన్ కుమార్ ఓటు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా. శ్వేత ఎన్నికలలో ఓటర్ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా. కే. స్రవంతి ఓటు హక్కు వినియోగం ప్రతి పౌరుని బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర సహాయ ఆచార్యులు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారిణి డా. సామ. సువర్ణాదేవి "మై ఇండియా = మై ఓట్" అంశంపై ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డా. కిషోర్, డా. స్వప్న, ఏం. హరి ప్రసాద్, తిరుపతి, కమలాకర్, సంతోష్, కరుణాకరాచారి, మహేందర్, ఇందిరా, కల్పన, అనిరుద్ బోధనేతర సిబ్బంది ఇలియాస్, సత్యం, అయోధ్య శ్రీకాంతులు పాల్గొన్నారు.



టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ధరఖాస్తు చేసుకోండి

- ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- మై భారత్, మేర యువ భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 25:

గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షలకు సిద్దిపేట టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నారని , నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని మై భారత్, మేరా యువ భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం లు అన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ తో కలిసి వేరు వేరుగా జరిగిన కార్యక్రమాలలో ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అభ్యర్థులు అందరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 9 నుంచి 30 వ తేదీ వరకు దరఖాస్తు లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycercle.co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 8 న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 91822 20112 లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ పోగ్రాం అధికారి కిరణ్ కుమార్. అధ్యాపకులు డా సువర్ణదేవి , రమశ్రీ ,తిరుపతి , లింగమూర్తి శ్రీనివాస్, ఆర్ శ్రీనివాస్, వినోద్ రామ్ కిషన్ జీ, యూత్ జిల్లా అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు

స్వామివారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 25:

నియోజకవర్గంలోని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ఆదివారం నాడు హైకోర్టు న్యాయమూర్తి నందికంటి నరసింహారావు దంపతులు స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. వారికి దేవాలయ అర్చక సిబ్బంది పూర్ణ కుంభతో స్వాగతం పలుకుతూ వారి దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాన్ని మరియు తీర్థప్రసాదాన్ని అందించారు. వారితోపాటు గజ్వేల్ అడిషనల్ జడ్జ్ మణివీర్ గజ్వేల్ ఏసిపి నరసింహులు,రూరల్ సీఐ మరియు గౌరారం ఎస్సై ఆలయ ధర్మకర్త కొత్తపల్లి శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న స్వామి కల్యాణం

- కోరమీసాల మల్లన్న చెంత భక్తజనం.

ప్రతిపక్షం,మెదక్ టౌన్,జనవరి 25

మెదక్ మండలంలోని మంబోజిపల్లి శివారులోని కొయ్య గుట్టపై కొలువుదీరిన మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మల్లన్నస్వామి జాతర ఆలయ పూజారి మల్లన్న ఆధ్వర్యంలో ఆదివారం మల్లన్న కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్లన్న స్వామికి ఉదయం నుండే ప్రత్యేక పూజలు, గంగా,యమునా,సరస్వతీ పుణ్యనదీజలాలతో ఏకాదశ రుద్రభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మల్లన్న స్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు మల్లన్నస్వామి, మల్లికార్జున్,వేద పండితులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు ఓడి బియ్యం సమర్పించారు.ఈ సందర్భంగా బండ్ల ఊరేగింపు,ఒగ్గు కళాకారుల నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున మల్లికార్జున స్వామి ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

“



స్వార్థ ప్రయోజనాల కోసమే సింగరేణిలో కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బొగ్గు ఉత్పత్తి తగ్గిపోతోంది. సింగరేణి కార్మికులను కూడా ప్రభుత్వం మోసం చేస్తోంది. వారికి వైద్యాన్నీ దూరం చేశారు. సంస్థ అభివృద్ధి కోసం పక్కనపెట్టిన రూ.6వేల కోట్ల లెక్కతేల్చుతాం. సింగరేణిలో మిగిలిన స్కామ్‌లను బయటపెడతాం.

- బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

ప్రాంతీయం

గణతంత్ర దినోత్సవ పర్వం
భారత జాతికి మహా పండగ..

- అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 25:

జనవరి 26 భారతదేశ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం 'స్వతంత్ర భారత జాతీయ పతాకం' పండుగ క్యాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ "గణతంత్ర పర్వం, భారతజాతికి గర్వం అన్నారు.ఆనందలే సర్వం" ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి దాస్య శృంఖలాలను ఛేదించి ఎందరో ప్రాణత్యాగధనుల పుణ్యఫలం మనం అనుభవించే స్వాతంత్ర్యం అని, స్వతంత్రం సిద్దించి భారత జాతికి పెనుమార్పులు సంభవించినాయన్నారు.ఇంక మనమనుకున్న ఐకమత్యం, సహజీవనం, అభివృద్ధి లక్ష్యాలవైపు పూర్తిస్థాయిలో అధిగమించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ తెలిపారు. ముఖ్యమంత్రి బంగారు తెలంగాణ లక్ష్యాలు రైతుబంధు, రైతు బీమా, నీటిపారుదల ప్రాజెక్టులు శాంతిభద్రతలు ప్రజా సంక్షేమ పతకాలు, దీనులకు ఆసరా కళ్యాణలక్ష్మి దళితబంధు భారతావనికి ప్రపంచ మానవాళికి మార్గదర్శకాలు. భారత స్వాతంత్ర్య దినోత్సవం ఐకమత్యం సహజీవనం ప్రతి పౌరునికి రక్షణ, లేనివారికి రేషన్ కార్డులు, నిరుద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని అందరి జీవితాల్లో ఆనందాలు పంచాలని, అనైక్యత ను అధిగమించాలని



అందరు కలసిమెలసి ఐక్యంగా అప్రమత్తంగా ఉండాలని ప్రతి భారతీయుడు సగర్వంగా తలెత్తుకొని భారత జెండా పండుగను జరుపుకోవాలని ప్రఖ్యాత మానవతా చిత్రకారులు రుస్తుం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం. అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనా రుస్తుం, సాధిక్ మహ్మద్, నైరూప్య చిత్రకారుడు నహీం రుస్తుం, మహ్మద్ రహీం తదితరులు పాల్గొన్నారు.

'లష్కర్ వారం'కు పోటెత్తిన భక్తజనం

- భారీగా తరలివచ్చిన భక్తులు.
- మల్లన్న నామస్మరణతో మారు మ్రోగిన ఆలయ ప్రాంగాణాలు.
- మల్లన్న స్వామిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు..

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 25:



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో రెండవ ఆదివారం (లష్కర్ వారం)కు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కొమురవెల్లి మల్లన్న నీకు కోటక్క దండాలు, సత్తేటి వారాలా స్వామి మల్లన్న నీకు లక్షొక్క దండాలు, కోరమీసాల మల్లన్న నీకు కోటొక్క దండాలు అంటూ భక్తులు శ్రీమల్లికార్జునస్వామిని మదిలో తలచుకుంటూ సుమారు 50 వేలకు పైగా మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు మల్లన్న నామస్మరణతో మారుమ్రోగాయి. సంక్రాతి తర్వాత వచ్చే సత్తేటి వారాలలో రెండవ ఆదివారాన్ని లష్కర్ వారంగా భక్తులు భావిస్తూ హైదరాబాద్, సికింద్రబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి పట్టణాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. లష్కర్ వారంకు భక్తులు భారీగా తరలిరావడంతో దేవస్థానంకు సంబందించిన గదులు చాలక పోవడంతో ప్రయివేటు గదులను ఆశ్రయించాల్సిన అవసరం వచ్చింది. భక్తులు ఆలయ ప్రాంగణంలోని గంగరేగు చెట్టు, రాజగోపురం, రాతిగీరలు, కోడెల స్థంబం, తోటబావి, ఎల్లమ్మ కమాన్, బస్టాండ్ ప్రాంగణం, సినిమా టాకిస్ ప్రాంగణం, రాంసాగర్ రోడ్డులోని కుర్మసంఘం వరకు, మల్లన్న చెరువు పార్కింగ్ స్థలం, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఖాళీ స్థలాలు భక్తులు విడిదితో పూర్తిగా నిండిపోయాయి. మల్లన్నకు ప్రత్యేక పూజలు మల్లన్నకు మొక్కులు అప్పగించడానికి వచ్చిన భక్తులు స్వామి వారికి తలనీలలు సమర్పించి, మల్లన్న కోనేరులో స్నానమాచరించి ఒక్కపొద్దులతో మట్టికుండలలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. ఏడు, ఐదు, మూడు, రెండు ఒక ఆంత్రాల భోనాలను ఎత్తుకొని శివ సత్తులు సిగమూగుతూ డప్పుచప్పుళ్ళతో స్వామికి మొక్కులు చెల్లించారు. అనంతరం గంగిరేగు చెట్టు వద్ద భోనాలు పెట్టి పట్నాలు వేసి మల్లన్నకు మొక్కులు అప్పగించారు. అనంతరం క్యూలైన్లో వెళ్లి మల్లన్నను దర్శించుకున్నారు. మల్లన్న స్వామి ధర్మదర్శనానికి నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టింది. శీఘ్ర,విశిష్ట దర్శనంలో మూడు గంటలు, రూ.500ల వివిఐపి దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీ రేణుక ఎల్లమ్మకు మొక్కలు చెల్లింపు. కొమురవెల్లికి వచ్చిన భక్తులు మొదట మల్లన్నకు బోనాలు, పట్నాలు అప్పగించారు. అనంతరం మల్లన్న గుట్ట (ఇంద్రకీలాద్రి గుట్ట)పై వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మకు శివసత్తులు బోనాలు ఎత్తుకుని సుమారు 500 మెట్లు ఎక్కుకుంటూ మొక్కులు చెల్లించారు. రేణుక ఎల్లమ్మతో పాటు నల్లపోచమ్మలను దర్శించు కోవాడానికి మూడు గంటల సమయం పట్టింది. కొమురవెల్లిలో మల్లన్నకు మొక్కులు అప్పగించిన తర్వాత గుట్టపై వెలసిన రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మల్లన్నను దర్శించుకున్న పలువురు ప్రముఖులు. కొమురవెల్లి మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా మల్లికార్జున స్వామిని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన కుటుంబ సభ్యులు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి స్వామివారి లడ్డు ప్రసాదం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు.



చిన్ననాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 25 :

క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించిన విద్యా సంస్థలో వారందరు చదివారు.పాఠశాల ఆవిర్భవించిన నాటి నుంచి యాభై ఏళ్ళలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఒక చోట కలిశారు. గురువులను కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గ్రూప్, సెల్ఫీ ఫోటోలు దిగి సందడి చేశారు. విద్యా బుద్ధులు నేర్పించిన ఆచార్యులను సన్మానించారు. సుదీర్ఘ విరామం అనంతరం స్నేహితులు కలవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ఇందుకు మెదక్ లోని వినాయక కన్వెన్షన్ హాల్ వేదికైంది. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ 19712018 వరకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన శ్రీ సరస్వతి విద్యా పీఠం తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద విద్య శిక్షణ సంస్థ సరస్వతి శిశుమందిర్ అని, ఇందులో చదివిన విద్యార్థులు విలువలు, సంస్కారంతో పెరిగారన్నారు. ప్రతి మండలంలో శిశు మందిర్ పాఠశాల ఉండాలని, జిల్లా కేంద్రంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ఉండాలన్నారు. మాతృ భాష ద్వారా సంస్కృతి, ధర్మం రక్షించబడుతుందన్నారు. క్షేత్ర పూర్వ విద్యార్థి పరిషత్ సంయోజక్ హరిస్మరన్ రెడ్డి మాట్లాడుతూ యువతను జాగృతం చేసేందుకు, సనాతన ధర్మం వైపు తీసుకెళ్ళేందుకు 1952 లో గోరక్ పూర్ లో శిశు మందిర్ పాఠశాల ప్రారంభం అయిందన్నారు. ఒక కోటికి పైగా ఉన్న పూర్వ విద్యార్థులు అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్నారని అన్నారు. సీఐ మల్కాజి రాఘవేంద్ర మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాలలో చదవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. పాఠశాలలో చిన్నప్పుడు ఖాకీ యూనిఫాం ధరించిన తనకు నిజ జీవతంలో భాగమైందన్నారు. సీఐ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాల చదువుతో పాటు విలువలు నేర్పాయన్నారు. అటవీ శాఖ రేంజ్ అధికారి విష్ణువర్ధన్ రావు మాట్లాడారు. పట్టణంలో నిర్మించే పాఠశాల నూతన భవన నిర్మాణనికి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి. సమ్మేళనానికి వేయి మంది పూర్వ విద్యార్థులు, 150 మంది పూర్వ ఆచార్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులు గంజి శ్రీనివాస్, కార్యదర్శి దేవదత్తు, సహా కార్యదర్శి సుధాకర్, శిశు మందిర్ సమితి అధ్యక్షులు డా. భానుచందర్, సహా అధ్యక్షులు బండి వెంకటేశ్వర్లు, మెదక్ విభాగ్ కార్యవాహ నాగభూషణం, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి చైర్మెన్ రాజ్ కుమార్, పాఠశాల ప్రధానాచార్యులు ఆనంద్ రెడ్డి, విభాగ్ శైక్షనిక్ ప్రముఖ్ వెంకట్ రాంరెడ్డి, పాఠశాల బాధ్యులు మల్కాజీ సత్య నారాయణ, చోళ పవన్, నారాయణ, పిప్పిరి రవీందర్, సమ్మేళనం నిర్వాహకులు బండి నరేష్, రాఘవేందర్, శివ భార్గవ్, నవీన్, సంతోష్‌కుమార్ , సుధాకర్, నాగరాజు, ప్రబంధకారిణి, సమితి సభ్యులు, పాఠశాల ఆచార్య బృందం పాల్గొన్నారు.

హరీశ్.. మెదక్ పట్టణ అభివృద్ధిని అడ్డుకోకు

- మైనంపల్లి హనుమంతరావు
- బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన నాయకులు
- వెయ్యి మందితో బైక్ ర్యాలీ

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 25 :



గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో మెదక్ పట్టణ అభివృద్ధికి నోచుకోలేదని మెదక్ జిల్లా నుండి ప్రధాన కార్యాలయాలు సిద్దిపేట ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ అభివృద్ధి పరిచావు కానీ మెదక్ పట్టణ అభివృద్ధిని పట్టించుకోని నీవు ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టడానికి తిరిగి మెదక్ వస్తున్నావు నిన్ను అడ్డుకుంటామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు అన్నారు. ఆదివారం భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ చేరడంలో మెదక్ పట్టణ శివారు నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. వెయ్యి మందితో మెదక్ జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం వెంకటేశ్వర గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముందుగుల గంగాధర్. అధ్యక్షతన జరిగిన సభలో మైనాంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ. మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే అయిన తర్వాత మెదక్ నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో అభివృద్ధికి తీసుకోవడం జరిగిందని జిల్లా కేంద్రంలో అర్బన్ హెల్త్ సెంటర్ స్టేడియంలో లైట్లు అన్ని రంగాలలో మెదక్ పట్టణాన్ని అభివృద్ధి పరుస్తుంటే హరీష్ రావు. తనకు తాను చాలెంజ్ చేసుకుని మెదక్ పట్టణం పై గులాబీ జెండా ఎగరాలని ఉద్దేశంతో మెదక్ పట్టణాన్ని మరోసారి అభివృద్ధి అడ్డుకోవడానికి పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నాడని ఆయన తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రం నుండి గతంలో కార్యాలయాలను తరలించడం కాకుండా సర్ధనా కొంగోడు గ్రామాలలో ఇసుక తరలించకపోయాదని ఆయన తెలిపారు సిరిసిల్లలో ఇసుకను అమ్ముకున్న కేటీఆర్ ను అడ్డుకున్నందుకు అక్కడ దళితులపై థర్డ్ డిగ్రీ చెలాయించి చిత్రహింసలకు గురిచేసిన నాయకులు బిఆర్ఎస్ నాయకులని ఆయన అన్నారు. ఈ నాయకులతో అక్కడ ఉన్న దళితులు ఇప్పటికీ ఆర్థికంగా కుంగిపోయారని వారు శారీరకంగా కూడా పనిచేయలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆయన తెలిపారు. మెదక్ నియోజకవర్గం లో ఎప్పుడు చేయని అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే కొనసాగుతుందని ఏడుపాయల లో 35 కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం ఖర్చు చేయడం జరిగిందని ఏడుపాయల వన దుర్గ మాత దర్శనానికి ఏ ముఖ్యమంత్రి కూడా రాలేదని కేవలం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి దర్శనం చేయడం జరిగిందని ఆయన తెలిపారు ఆసియా ఖండంలో అతిపెద్ద రెండో చర్చిగా పేరుగాంచిన మెదక్ సిఎస్ఐ చర్చికి అభివృద్ధికి ఏ ప్రభుత్వం సహకరించలేదని 29 కోట్ల 30 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ఆయన తెలిపారు గత వర్షాకాలంలో వరదలతో మెదక్ ప్రాంతం తల్లాడిల్లుతుంటే 24 గంటల పాటు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రజల కోసం పనిచేయడం జరిగిందని ఆయన తెలిపారు దురదృష్ట శాతం ముగ్గురు వ్యక్తులు చనిపోతే వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటూ ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందని తెలిపారు 24 గంటల్లో ముఖ్యమంత్రి మెదక్ జిల్లా కేంద్రానికి వచ్చి వరద నష్టం పైన ముఖ్యమంత్రి రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఏడుపాయల వన దుర్గ మాత సన్నిధిలో అన్ని కులాసంఘాల వారికి భవనాల నిర్మాణం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికలలో మెదక్ పైన కాంగ్రెస్ జెండా ఎగరాలని దీని కోసం ప్రతి కార్యకర్త నాయకులు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు సీనియర్ కార్యకర్తలను గౌరవించి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు

ధర్మానికి అధర్మానికి జరుగుతున్న పోరు:- డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలలో జరుగుతున్న పోరు ధర్మానికి అధర్మానికి జరుగుతున్న పోరా అని ఈ పోరులో ధర్మం వైపు నిలబడి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ జెండాను పట్టుకొని మున్సిపల్ పై అన్ని చైర్మన్ గెలిచి మున్సిపాలిటీలపై జెండా ఎగరాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులదని కార్యకర్తలని దీన్ని సద్వినియోగం చేసుకొని మున్సిపల్ కౌన్సిలర్ల గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్రజా సామిక పనులని ప్రజలకు వివరించాలని ఆయన కోరారు.అనంతరం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో చింతల నర్సింలు. చింతల దిలీప్ లక్ష్మి సరాగిణి. ఉప్పల కృష్ణయ్య మాడిశెట్టి ఆంజనేయులు సహా 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు మాజీ కౌన్సిలర్లు ప్రవీణ్ గౌడ్. జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షులు కిరణ్ గౌడ్. కాంగ్రెస్ నాయకులు హాఫీజ్. మేడం బాలకృష్ణ. కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్. మొన్న ఉమర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్. తిమ్మన్న గారి అనిల్ తదితరులు పాల్గొన్నారు

ప్రజలను ఆకట్టుకున్న వెయ్యి మంది బైక్ ర్యాలీ

భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మెదక్ పట్టణ శివారు నుండి సుమారు 1000 మందితో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు పాత ఎస్పీ కార్యాలయం నుండి ఆటోనగర్ ఓల్డ్ బస్టాండ్ రాందాస్ చౌరస్తా. డిపో నుండి బోధన్ చౌరస్తా మీదుగా వెంకటేశ్వర గార్డెన్ కు చేరుకుంది మైనంపల్లి హనుమంతరావు బుల్లెట్ నడపడంతో కార్యకర్తలు ఉత్తేజపరిచారు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రా ఆయుధం

- ప్రతి ఒక్కరూ ఓట్లను వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 25 :



ప్రజాస్వామ్య ములో ఓటు హక్కు వజ్రాయుధమని , 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారము మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం నుండి బాలుర జూనియర్ పాఠశాల మరియు కళాశాల మైదానం వరకు 16 వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురష్కరించుకొని ర్యాలి నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు పాల్గొన్నారు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు, ఓటర్ల అందరిచే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు అనంతరం 16వ జాతీయ ఓటరు దినోత్సవము సందర్భంగా కళాశాల మైదానం గ్రౌండ్లో. నందు ఏర్పాటు చేసిన సమావేశములో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అందరు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కుపై అవగాహనా కలిపించికోవాలని సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన ఎనిమిది మందికి ఓటు హక్కు కలిపిస్తూ బ్యాడ్జీలు పంపిణి చేశారు. ప్రజాస్వామ్యములో 85 సంవత్సరాల నుండి ఓటు హక్కు వినియోగించుకున్న03 మంది సీనియర్ సిటిజన్స్ కు ఈ సందర్భంగాశాలువాలతో సన్మానం చేశారు. ఓటరు అవగాహనా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిమ కనబరిచిన వారికి సర్టిఫికేట్ లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ,జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, వ్యవసాయ అధికారి దేవకుమార్ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ఇంటర్మీడియట్ అధికారి మాధవి , ,తాసిల్దార్ లక్ష్మణ్ బాబు , ఎన్నికల తాసిల్దార్ గఫార్, డీఎస్పీ ప్రసన్నకుమార్,, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు,,అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తి పనులకు నిధులు మంజూరు చేసిన ఎంపీ

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 25:

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన పద్మశాలి సంఘం లో కనీస అవసరాలు తీరేందుకు ఎంపీ రఘునందన్ రావు పది లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం నాడు అందించారు. మిగతా వర్క్ గురించి ఫంక్షన్ హాల్ పైన ఇన్స్ట్రుమెంట్ చేసి పంపించాలని ఫంక్షన్ హాల్ పై భాగానఎంత ఖర్చైనా తాను సాంక్షన్ చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్,గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి అధ్యక్షుడు బోల్లి బత్తులదేవదాస్, మరియు కార్యవర్గం సభ్యులు పద్మశాలిలు పాల్గొనడం జరిగింది.

గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకయ్యకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్,జనవరి 25:

తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా సంఘ అభివృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా విశేష సేవలు అందించినందుకు, అలాగే గంగిరెద్దుల విన్యాస కళారంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గాను కళాకారుడు, సంఘ సేవకుడైన కనకయ్యకు ప్రతిష్ఠాత్మక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం లభించింది.నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవలందించిన ప్రముఖులు, కళాకారులను గుర్తిస్తూ ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ఆదివారం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ బసవరాజ్ కనకయ్యకు అవార్డును అందజేశారు. ఈ



సందర్భంగా నిర్వాహకులు కనకయ్య గారి సేవలను ప్రశంసిస్తూ, గంగిరెద్దుల సంప్రదాయ కళను పరిరక్షిస్తూ ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని అన్నారు.




ఎంపీడీవోల సంఘం నారాయణపేట్ జిల్లా అధ్యక్షుడిగా
టి శ్రీనివాసులు

- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణ పేట్ జిల్లా జనవరి 25

మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నర్వ ఎంపీడీవో టి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నారాయణ పేట జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా తమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపీడీవో టి శ్రీనివాసులు తో పాటు దామర్గిద్ద ఎంపిడిఓ సాయి లక్ష్మినీ ఉపాధ్యక్షులుగా, మక్తల్ ఎంపీడీఓ రమేష్‌కుమార్ లను నజనరల్ సెక్రటరీలు గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల నర్వ ఉపాధి సిబ్బంది,పంచాయతీ కార్యదర్శిలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ఆయనకున్న పట్టును గుర్తించి జిల్లా పదవిని అప్పగించారని పలువురు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమం లో జిల్లాలోని ఆయా మండలాల ఎంపీడీఓ లు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌లో ఏపీ ప్రాజెక్టులకు నిధులు సాధించాలి. రాష్ట్రాభివృద్ధిలో ఎంపీల భాగస్వామ్యం కీలకంగా ఉండాలి. ఉత్తరాంధ్ర,- రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజ్, పూర్వోదయ పథకం, పోలవరం-నల్లమల సాగర్, అమరావతికి చట్టబద్ధతను ప్రాధాన్యతాంశాలుగా తీసుకోవాలి. కేంద్ర మంత్రులు, అధికారులతో టచ్‌లో ఉండాలి. సభలో ప్రతి ఒక్కరూ మాట్లాడాలి.

- ఎంపీలతో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

అభివృద్ధి పనుల్లో అర్బన్ ఎమ్మెల్యే విఫలం

- గోడలపై రాతలు కాదు నగర అభివృద్ధి కి ప్రణాళికలు చేయాలని సూచన
- మాజీ ఎమ్మెల్యే గణేష్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 25 :

బీఆర్ఎస్ హయాంలో సింహ భాగం పూర్తైన పనులు, చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ విఫలమయ్యాడని మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విమర్శించారు. ఎమ్మెల్యే నిధులు రాని పక్షంలో నా ట్రస్ట్ అభివృద్ధి ద్వారా నగర అభివృద్ధి చేస్తానని మాటలు మాట్లాడి అభివృద్ధి ని విస్మరిస్తున్నారని మండి పడ్డారు. ఆదివారం బీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ హయం లో చేసిన అభివృద్ధి పనులు తప్ప ఒక్క ఇటుక కూడా ఈ రెండు సంవత్సరాల కాలంలో పెట్టలేదని విమర్శించారు. రోజు రోజుకు నగరం విస్తరిస్తునందున ప్రజలకు స్వచమైన నిత్యావసరాలు అందుబాటులో ఉండే విధంగా చేపట్టిన మార్కెట్ పనులను తమ హయాంలో సింహ భాగం పూర్తి చేసిన ఇప్పటి ఈ ప్రభుత్వం, ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా అవి అసాంఘిక కార్యకలాపకలకు అడ్డలుగా మారాయని విమర్శించారు.కొత్త పనులు చేయకపోగా అహ్మదిబజార్ లో మా హయాంలో నిర్మాణం పూర్తి చేసిన మార్కెట్ ను ఆదివారం పరిశీలించామని, ప్రస్తుతం ఆ మార్కెట్ పరిస్థితి అధ్వన్నంగా ఉందని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి దుర్వాసనాతో కంపు కొడుతుందని ఇప్పటికి ఎందుకు దుకాణాలు కేటాయించలేదని ప్రశ్నించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన గోడల మీద రాతలు రాయటం, శంబుని గుడి పక్కన ఉన్న దుకాణాలను తొలగించి వారికి ఈ మార్కెట్ లో షాప్స్ కేటాయించాలని ఆందోళనలు చేసి ప్రతి సారి అభివృద్ధికి అడ్డం పడ్డారని ఇప్పుడు మీరు అధికారంలో ఉన్న ఎందుకు దుకాణాలను తరలించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తిగా జరిగిన ఎందుకు కేటాయిస్తాలేరని అన్నారు. అభివృద్ధి పనులు చేసే ఆలోచన లేకపోయినా కనీసం ఉన్న పనులను ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లుగా విజయం సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమాన్ని మాటలు చెప్పటం కాదు చేతల్లో చూపించిన చరిత్ర మాదని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు సమిపిస్తున్నందున కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్నారని కానీ, ఆ నిధులను తీసుకువచ్చిన ఘనత తమ పార్టీకి దక్కుతుందని, రూ. 100కోట్ల నిధులు మా ప్రభుత్వం హయాంలో మంజూరై ప్రతి డివిజన్ లో అభివృద్ధి పనులను ప్రారంభించామని గుర్తు చేశారు. TUFIDC ద్వారా గతంలో రూ.60 కోట్ల తో జీ వో తీసుకువచ్చింది తామేనని అన్నారు. ఆ జీ వో కు సంబంధించిన పనులను ఒక్క అడుగు ముందుకు పోక పోగా పాత జీ వో ను కొత్త తేదీల్లో మార్చి తామే తీసుకువచ్చినట్టు బీజేపీ కాంగ్రెస్ పార్టీలు మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం హయాంలో రెండు సంవత్సరాల కాలంలో కొత్తగా కేవలం రూ.10 కోట్ల నిధులు మాత్రమే వచ్చాయాని అన్నారు. నిజామాబాద్ నగరంలో గతంలో విద్యుత్ కాంతులతో నిండిన నగరం నేడు అంధకారం ఎందుకు అయ్యింది. చేసిన అభివృద్ధిని పనులను కనీసం నిర్వహణ చేయలేని దౌర్భాగ్య పరిస్థితి లో ఈ ఎమ్మెల్యే ఉన్నారని ఏద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం హయాంలో శాంతి భద్రతలు క్షిణించాయని ఒక కానిస్టేబుల్ హత్య చేయబడ్డాదని, నిన్ననే ఒక మహిళ ఎక్సజ్ కానిస్టేబుల్ పై వాహనంతో తొక్కించారాని విమర్శించారు. ఈ సమావేశంలో నగర మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, బీ ఆర్ ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నూడా ఛైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యప్రకాష్, సుజిత్ ఠాకూర్, జగత్ రెడ్డి, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్ షహజాద్, అబ్దుల్ మతీన్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లెపూల నరేంద్రను ఈ సమాజం ఎప్పటికీ మరువదు

- ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 25 :



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన స్వర్గీయ జర్నలిస్ట్ మల్లెపూల నరేంద్రను ఈ సమాజం ఎప్పటికి మరువదని ఉర్దూ అకాడమి ఛైర్మెన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. జర్నలిస్ట్ మల్లెపూల నరేంద్ర మెమోరియల్ స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో మల్లెపూల నరేంద్ర 35వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో జర్నలిస్టుకు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను మహిళ ఎడ్యుకేషన్ కళాశాల ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎం రాజేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ ఈనాడు గ్రామీణ విలేకరిగా పనిచేస్తూ తన విధి నిర్వహణలో అమరుడైన నరేంద్ర జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న కార్యాక్రమాలు పది మందికి చిరకాలంగా గుర్తుండి పోయే విధంగా నరేంద్ర విషయాన్ని ఈ సమాజం, ఈ జిల్లా ఎప్పుడు గుర్తుంచుకుంటుందన్నారు. గత 35 సంవత్సరాలుగా నరేంద్ర స్మారకార్థం క్రీడా పోటీలు నిర్వహించటం ఎంతో గొప్ప విషయమని, ఇది ఒక రికార్డు అని పేర్కొన్నారు. ఇన్ని సంవత్సరాల పాటు స్మారక పోటీలు ఎవరూ నిర్వహించలేరని, ఇది నరేంద్ర మెమోరియల్ స్పోర్ట్స్ కమిటి నిర్వాహకులకు స్థానిక జర్నలిస్టులకు సాధ్యమయ్యిందని, ఈ సందర్భంగా నిర్వాహకులను, జర్నలిస్టులను తాహెర్ అభినందించారు. నిజామాబాద్ మహిళ ఎడ్యుకేషన్ కళాశాల ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు మల్లెపూల నరేంద్ర స్మారకార్థం గత 35 సంవత్సరాలుగా నిర్వహిస్తున క్రీడా పోటీలలో జర్నలిస్టుల చొరవ ఎంతో అభినందీయమన్నారు. ఎవరైన చనిపోతే ఒకటి లేదా రెండు సంవత్సరాల పాటు వారిని గుర్తుంచుకుని ఏదైనా కార్యక్రమాలు చేస్తారు కానీ, జర్నలిస్టు నరేంద్ర మృతి చెంది 35 సంవత్సరాలు అవుతున్న ఇంకా ఆయనను గుర్తుంచుకుని ఇటువంటి కార్యక్రమాలు చేయటం హర్షించదగ విషయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను, నరేంద్ర కుటుంబ సభ్యులను, జర్నలిస్టులను ఆయన అభినందించారు. నరేంద్ర మెమోరియల్ స్పోర్ట్స్ కమిటి ఛైర్మెన్ డి సాయిలు మాట్లాడుతూ నరేంద్ర మృతి చెంది 35 సంవత్సరాలు అవుతోంది. అప్పటి నుంచి నిరాటకంగా, నిర్వీరంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 35 సంవత్సరాలుగా నరేంద్రను స్మరించుకుంటూ జర్నలిస్టులకు క్రికెట్, షటిల్, క్యారం పోటీలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఖోఖో పోటీలు రెండురోజుల పాటు నిర్వహించామన్నారు. నరేంద్ర 1989లో ఈనాడు గ్రామీణ విలేకరిగా చేరి 1991 జనవరి 29న విధి నిర్వహణలో ఆకస్మిక మరణం పొందారు. అప్పటినుంచి ప్రజాప్రతినిధులు, జర్నలిస్టుల సహకారంతో పోటీలు నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ పోటీలకు అన్ని విధాల సహకారాలు అందిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. వచ్చే సంవత్సరం నరేంద్ర స్మారకార్థంగా మొదట్లో ఎలా పోటీలు నిర్వహించామో పూర్తిస్థాయిలో కమిటీలు వేసి అదే విధంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్ మాట్లాడుతూ స్వర్గీయ మల్లెపూల నరేంద్ర మెమోరియల్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు జర్నలిస్టులకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నరేంద్ర యాదిలో 35 సంవత్సరాలుగా క్రీడా పోటీలు నిర్వహించటం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ క్రీడాపోటీలు తమ జర్నలిస్టులలో ఐక్యతను నిరూపిస్తోందన్నారు. నరేంద్రను యాది చేస్తూ రానున్న పోటీలు స్కూల్ పిల్లలకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నరేంద్ర మెమోరియల్ స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ మల్లెపూల నర్సయ్య, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వాగ్మేరే సుభాష్, కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొచ్చ రాజు, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజీ, ఎటాక్స్ కమిటి ఛైర్మెన్ బొబ్బిలి నర్సయ్య, మీసాల సుధాకర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లలు, కెమోరామెన్లు పాల్గొన్నారు.

సుభాష్ జట్టు గెలుపు...

జర్నలిస్టు నరేంద్ర స్మారక పోటీలలో భాగంగా ఆదివారం జరిగిన క్రికెట్ పోటిలలో పంచరెడ్డి శ్రీకాంత్ ఎలెవన్ జట్టుపై సుభాష్ ఎలెవన్ జట్టు మూడు పరుగల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన సుభాష్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. ఇందులో శ్యామ్ 41 పరుగులు, రవికాంత్ 34 పరుగులు చేశారు. ఇక 116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంచరెడ్డి శ్రీకాంత్ జట్టు 16 ఓవర్లతో 5 వికెట్లు కోల్పోయి 113 పరుగులు మాత్రమే చేసి మూడు పరుగుల తేడాతో ఓటమి పాలైయ్యింది.



వెలుగు మహానంది జాతీయ అవార్డు అందుకున్న డా. శ్రీనివాస్ నాయక్

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, జనవరి 25

సిద్దిపేటకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ నాయక్ వెలుగు మహానంది జాతీయ అవార్డు అందుకున్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన తెలుగు వెలుగు మహానంది జాతీయ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రతిభావంతులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల దంత వైద్య నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ గారికి వెలుగు మహానంది జాతీయ అవార్డు లభించింది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించగా, నిర్వాహకులు ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. అవార్డు స్వీకరణ అనంతరం మాట్లాడిన డాక్టర్ శ్రీనివాస్ నాయక్ గారు, తెలంగాణ రాష్ట్రం తరపున తనకు లభించిన ఈ గౌరవానికి వెలుగు మహానంది అవార్డు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత సేవాభావంతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన అవార్డు గ్రహీతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాలకు నియామక పత్రాల పంపిణీ

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 25

మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వరంగల్ మరియు హనుమకొండ జిల్లాల కార్యవర్గ కమిటీలకు సంబంధించిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఈరోజు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులందరికీ అధికారికంగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు గద్ద నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పాడుగుల నరసయ్య, సంయుక్త కార్యదర్శ దార వెంకటేశ్వరరావు మరియు సముక్త కార్యదర్శి పనికల శ్రీనివాస్, కోశాధికారి మూల కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిండ్ల కుమార్ స్వామి, డైరెక్టర్ పప్పుల గంగాధర్ పాల్గొన్నారు. అలాగే వరంగల్ జిల్లా అధ్యక్షులు గుండాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గడ్డం రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యాదాల జగపతి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సొసైటీ స్టేట్ కమిటీ ఉపాధ్యక్షులు సిరివెళ్ల సారంగం, కార్యదర్శి మాల్లం రాజకుమార్, సంయుక్త కార్యదర్శి గొర్రె రమేష్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీలను అధికారికంగా ఏర్పాటు చేసి, నియమితులైన కార్యవర్గ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. అలాగే సంఘ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా విద్యా అభివృద్ధి, సామాజిక అవగాహన, యువతకు మార్గదర్శనం వంటి అంశాలపై మరింత సమర్థవంతంగా పనిచేస్తామని తెలిపారు. జిల్లాల స్థాయిలో బలమైన కమిటీలతో ముందుకు సాగుతూ, విద్యా రంగంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల కార్యవర్గ సభ్యులు, సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



బంజారా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డా. కడియం కావ్య

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 25

హనుమకొండ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్ హాల్ నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు ముఖ్య అతిథిగా హాజరై బంజారా గోత్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం రంగాల్లో బంజారా సమాజం మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. తరతరాలుగా బంజారా సమాజం తన ప్రత్యేకమైన భాష, వేషధారణ, నృత్యాలు, పండుగలు, ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమని తెలిపారు. బంజారా గోత్ర క్యాలెండర్ ఆవిష్కరణ ద్వారా యువతకు బంజారా సంస్కృతి, చరిత్రపై అవగాహన మరింత పెరుగుతుందని, ఇది గిరిజన వారసత్వాన్ని రాబోయే తరాలకు అందించే మంచి ప్రయత్నమని ఎంపీ అన్నారు. సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, సాంస్కృతిక విలువలే దేశ బలమని పేర్కొంటూ, ఇలాంటి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు సమాజాన్ని ఏకం చేసే వేదికలుగా నిలుస్తాయని చెప్పారు. బంజారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ డా. కడియం కావ్య భరోసా ఇచ్చారు. హనుమకొండ లోని గిరిజన భవన అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోరిక వీరన్న నాయక్, సంగెం మాజీ జెడ్పిటిసి వీరమ్మ, రిటైర్డ్ డి ఈఓ జవహర్ లాల్ నాయక్, DMHO రవిరాథోడ్, రిటైర్డ్ ఆర్ జె డి వెంకట్రాం, మరియు భోజ్ నాయక్, డాక్టర్ రమేష్ నాయక్, వెంకట్ నాయక్, సర్పంచ్ బానోతు అరుణ రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మెదక్ పట్టణ అభివృద్ధికి కృషి

- రూ.4.32కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.

ప్రతిపక్షం,మెదక్ టౌన్,జనవరి 25

మెదక్ పట్టణంలో అభివృద్ధి బాటలో దూసుకెళ్లేందుకు కృషి చేస్తున్నానని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణంలో ఆదివారం 4కోట్ల 32 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్, డ్రైనేజ్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో మెదక్ వివక్షతకు గురైందన్నారు.మెదక్ గతం పదేళ్లుగా పాలించిన పాలకులు మెదక్ అభివృద్ధి పట్ల ఆసక్తి చూపక కేవలం వ్యక్తిగత అభివృద్ధి ధ్యేయంగా ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోక నేడు పట్టణ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు.అందుకోసం తాను ప్రజల అవసరాలను గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి కృషితో నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పట్టణ పార్టీ అధ్యక్షులు యం. గంగాధర్,మాజీ కౌన్సిలర్లు,లింగం, లక్ష్మీనారాయణ గౌడ్, సంయోద్దీన్, నాయకులు బొజ్జ పవన్, కృష్ణ, మధుసూదన్ రావు,ప్రవీణ్ గౌడ్, కొండ.శ్రీనివాస్,ఓమర్,ముజిబ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

- ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఎన్నికల్లో వినియోగించుకోవాలి*
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 25
- హనుమకొండ డీఈవో కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

హనుమకొండ:

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని డీఈఓ కార్యాలయం వద్ద నుండి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ర వి, ఆర్డీవో రాథోడ్ రమేష్, తదితరుల సమక్షంలో ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ హనుమకొండ కలెక్టరేట్ వరకు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణం వంటిదని, ప్రతి ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా పట్టణాల్లోని ఓటు కలిగిన విద్యార్థులు, యువత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఓటు అనే ఆయుధాన్ని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేస్తూ తెలంగాణ సాంస్కృతిక కళాకారులు గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కాజీపేట, హనుమకొండ తహసిల్దార్లు రాజు, రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఇతర అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

సంగారెడ్డి ఫసల్ వాది విద్యా పీఠానికి సీఎం రేవంత్ రెడ్డి ని తీసుకువస్తా

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 25:



సంగారెడ్డి మండలం ఫసల్ వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రథసప్తమిని పురస్కరించుకొని 1,671 మంది మహిళలతో భారీస్థాయిలో పాపనాశ వ్రతాన్ని నిర్వహించారు. మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపిసిసి జనరల్ సెక్రటరీ తోపాజి అనంత కిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పాపాలను హరింపజేసే ఈ వ్రతం లోక కళ్యాణార్థం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్ పాల్గొన్నారు.

“



ముద్దు సన్నివేశాల్లో నటించాలనే భయంతోనే బాలీవుడ్ అవకాశాలు వదులుకున్నా. ముద్దు సీన్లలో నటిస్తే పంజాబ్‌లో ఇమేజ్ ఏమవుతుందోనని భయపడ్డాను. నా ఫ్యామిలీ ఎలా అర్థం చేసుకుంటుందో, అభిమానులు ఏమనుకుంటారో అనుకున్నాను. పేరెంట్స్‌తో డిస్కస్ చేయడానికి సిగ్గుపడ్డాను. చివరికి అడిగితే 'సినిమా కోసమేగా. తప్పేముంది' అనడంతో షాకయ్యాను.

- నటి సోనమ్ బజ్వా

ప్రతిపక్షం
Prathipaksham.in
8
హైదరాబాద్
సోమవారం
26.01.2026
@prathipaksham
prathipakshamtvtelugu



కార్పొరేట్ స్థాయిలో పాఠశాలను తీర్చిదిద్దుతా

- హామీ మేరకు పాఠశాలకు రంగులు.
- సర్పంచ్ వెంకటేష్ గౌడ్.

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 25 :

కార్పొరేట్ స్థాయిలో గ్రామ పాఠశాలను అన్ని అంగులతో తీర్చిదిద్దుతానని సర్పంచ్ ఎలగని వెంకటేష్ గౌడ్ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామపంచాయతీ పరిధిలో గత కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని ఆలోచనతో ఉన్నానని ఆయన తెలిపారు. శిథిలావస్థకు చేరువలో ఉన్న ఏనాడు కూడా పాఠశాల రంగులకు నోచుకోలేదని చెప్పారు. సర్పంచ్ గా ఎన్నికైన కొన్ని రోజులకే మొదటి ప్రాధాన్యతగా గ్రామ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన పట్టుదలతో స్కూల్ భవనాలకు రంగులు వేసి ముస్తాబు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు రంగులతో ముస్తాబయి జాతీయ పండుగ సందర్భంగా గణతంత్ర దినోత్సవం వేడుకలకు ముందుగానే స్కూల్ భవనాలను అందంగా ముస్తాబు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని సంకల్పంతో ఆయన చెప్పారు.ఈ సందర్భంగా గ్రామస్తులు నూతన పంచాయతీ పాలకవర్గాన్ని అభినందించారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి : మంత్రి ఉత్తమ్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 25:

జిల్లా లో సాగునీటి ప్రాజెక్టు లపై దృష్టి సారించామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వా సలహాదారు షబ్బీర్ అలీ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీతో భేటీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న మార్గమధ్యలో కామారెడ్డి పట్టణం సిరిసిల్ల రోడ్డులోని దేశాయ్ బీడీ కంపెనీ గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో జిల్లా అభివృద్ధి, రాబోయే రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి కామారెడ్డి జిల్లా రైతాంగానికి వరప్రదాయిని అయిన ప్రాణహితచేవెళ్ల సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. జిల్లాలో సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనుల గురించి షబ్బీర్ అలీ మంత్రికి వివరించారు. పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను యుద్ధ ప్ర తిపదికన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జైత్రయాత్ర సాగించాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేయాలని నేతలు నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా



లను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని చర్చించారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కామారెడ్డి అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే.. నిలదీయాల్సిన సమయం వచ్చింది: షబ్బీర్ అలీ కామారెడ్డి పట్టణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని 19, 42, 43, 48 మరియు 49వ వార్డులలో సుమారు రూ. 2.5 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్లు, సిసి రోడ్లు, కల్వర్టుల నిర్మాణంతో పాటు, అమృత్ పథకం కింద తాగునీటి పైపులైన్ల విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపిస్తే, కామారెడ్డిలో ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కంటే రాజకీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజా ప్రతినిధిగా అందరినీ సమదృష్టితో చూడాల్సింది పోయి, ఆయన కేవలం ప్రోటోకాల్ కులాలు, మతాలకు మాత్రమే ప్రాధాన్యమిస్తూ వర్గాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని అన్నారు. సమాజంలో సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం ఒక ఎమ్మెల్యేకు తగదన్నారు. కేంద్రం నుండి నయాపైసా తేలేదు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, కామారెడ్డి పట్టణ అభివృద్ధికి అర్థ రూపాయి కూడా ఆయన తీసుకురాలేదన్నారు. తాను చేసిన పనులు, సాధించిన అభివృద్ధిని చూయించి ఓట్లు అడగాలి కానీ, అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. ప్రజలు ఆయన డ్రామాలను గమనిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిబ్రవరి రెండో వారంలో మున్సిపల్ ఎన్నికలు

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- సర్వే ల ఆధారంగానే టికెట్ల కేటాయింపు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 25 :

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రెండురోజుల్లోవచ్చే అవకాశాలున్నాయని భారీ నీటిపారుదల శాఖ మంత్రి, జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఫిబ్రవరి రెండో వారంలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నీ వంశీ హోటల్‌లో నిజామాబాద్ అర్బన్, బోధన్, ఆర్మూర్, మున్సిపాలిటీల సమీక్షకు మంత్రి ఉత్తమ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక సర్వే ల ఆధారంగానే టికెట్ల కేటాయింపు జరుగుతుందని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు బోధన్, భీమ్‌గల్, ఆర్మూర్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. 2009 నుంచి ఇక్కడ ఎమ్మెల్యే లేడని, 2014 నుంచి ఎంపీ లేడని ఈ నేపథ్యంలో నేటి నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. తాను కూడా ఎన్నికల



అయిపోయేంతవరకు మీకు ప్రతిక్షణం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో 60 డివిజన్లకు గాను కేవలం రెండు డివిజన్లు మాత్రమే కాంగ్రెస్ గెలుపొందిందని గుర్తు చేశారు. బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాలతో పాటు గత పదేళ్లలో తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు దొడ్డు బియ్యం అందిస్తే 90 శాతం మంది ప్రజలు వాటిని విక్రయించేవారన్నారు. దీంతో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం 3.17 కోట్ల ప్రజలకు రూ.13,600 కోట్లతో సన్నబియ్యాన్ని ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున అందజేస్తున్నట్లు ఈ పథకం చారిత్రాత్మకమైనట్లు తెలిపారు. అలాగే కొత్త రేషన్ కార్డులను కూడా మంజూరు చేసిందని చెప్పారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఏ ఒక్క సీనియర్ కార్యకర్తను వదులుకోవాలని కోరుకోదన్నారు. జిల్లా ఎంపీ అరవింద్ చేతగాని తనానికి నిదర్శనమని అన్నారు. బీజేపీ నాయకులు దేవుళ్ల పేర్లు చెప్పి ఓట్లు అడుగుతున్నారని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త దీనిని తిప్పి కొట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు, సన్నబియ్యం, ఉచిత కరెంటు, యువతకు ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం తీసుకుంటున్న పనులను ప్రతి గడపగడపకు తెలియజేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు లభిస్తుందని, ప్రతి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వహీదుద్దీన్‌కు భారత స్ఫూర్తి కిరిటీ పురస్కారం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 25:

సిద్దిపేటకు చెందిన ముహమ్మద్ వహీదుద్దీన్(రచయిత,కవి, సామాజిక సేవ, ఉపాధ్యాయుడు) కు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, కాలోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు వెలుగు సాహితీ వేదిక. స్వామి "వివేకానంద మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు 2026"సందర్భంగా హనుమకొండ జిల్లాలోని ఈరోజు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పశ్చిమ వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత శాంతి కృష్ణ ఆచార్య, తెలుగు వెలుగు జాతీయ అధ్యక్షుడు పోలోజు రాజ్ కు మార్ చార్యులు, ప్రముఖ హాస్య నటుడు ఆర్ఎస్ నంద, తెలుగు వెలుగు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోడిశెట్టి విష్ణువర్ధన్ , తార కమ్మ వారి కళ్యాణ వేదిక వ్యవస్థాపకులు మన్నె నాగమల్లేశ్వరి, ప్రముఖ కవి, రచయిత ,సామాజిక విశ్లేషకులువేముల తిరుపతిరెడ్డి సమక్షంలో ఘనంగా సత్కరించడం జరిగింది

దేశవ్యాప్తంగా చేనేత కార్మికులను ఆదుకోవాలి

- ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ డిమాండ్

ప్రతిపక్షం ప్రతినిధి సిద్దిపేట జనవరి 25:

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రూపంలో చేనేత కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ విమర్శించారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ 2వ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం కాకినాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేతపై విధించిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ప్రోత్సాహక పథకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలకే మృతి చెందిన



చేనేత కార్మికులకి రూ.5 లక్షల బీమా వర్తింపజేయాలని కోరారు. కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. జాకట్ మగ్గాలు కొనుగోలు కోసం ప్రతి చేనేత కార్మికునికి రూ.5 లక్షల రుణాలు మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ జియో ట్యాగ్ నిబంధనను వెంటనే తొలగించాలని కోరారు. చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చేనేత వృత్తి చేసిన పద్మశాలి, నీలకంఠ సమాజాలకు చెందిన కార్మికులకు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేసి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. కేంద్ర బడ్జెట్ లో చేనేత రంగానికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్ లో రూ.5 వేల కోట్లు కేటాయించి చేనేత సంఘాలకు క్యాష్ క్రెడిట్ లు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని తెలిపారు. చేనేత సంఘాలు తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి, వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రతినిధులు రాపోలు జగన్, వనం శాంతకుమార్, బాసబత్తిని రాజేశం, గడ్డం వెంకాటేశ్వర్లు, గవ్వల శంకర్, చెరకు స్వామి, కర్నాటి మనోహర్, వాల్యాల్ రమేశ్, కూరపాటి యాదగిరి, నీలకంఠ ప్రసాద్, పాశికంటి లక్ష్మి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



దగ్ధమైన పూరి గుడిసె

- రూ.10 లక్షల ఆస్తి నష్టం
- కూతురి పెళ్లికోసం పెట్టుకున్న రూ.5లక్షల నగదు, పెళ్లి బట్టలు అగ్నికి ఆహుతి
- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం
- చెరుకు శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం,చేగుంట,జనవరి 25:

పూరి గుడిసె దగ్ధమై సుమారు పది లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. కూతురు పెళ్లి కోసం ఇంట్లో దాచిన ఐదు లక్షల రూపాయల నగదు పెళ్లి బట్టలు కాలిపోయాయి. ఈ సంఘటన చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామంలో జరిగింది. చిట్టోజిపల్లి గ్రామానికి చెందిన ఎక్కడి శ్యామల భర్త నరసయ్య లకు చెందిన నివాస పూరిగుడి దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ చెరుకు శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంగళరావు గ్రామ సర్పంచ్ మద్ది లక్ష్మీనరసయ్య చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీక్ రెడ్డిపల్లి సొసైటీ ఛైర్మన్ పరమేష్ కాంగ్రెస్ నాయకులు వడ్ల నవీన్ సంద్రుగు శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మక నాణ్యమైన విద్యను అందించాలి

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 25 :

విద్యార్థులకు సృజనాత్మక నాణ్యమైన విద్యను అందించినప్పుడే విద్యార్థులు అభివృద్ధి చెందేందుకు వీలుంటుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణలు అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గ్రామ పరిధిలో శ్రీ శివ సాయి పబ్లిక్ స్కూల్ 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ గోపాలరావు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి విద్యార్థులు రేపటి భావిభారతం పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత స్కూల్ యాజమాన్యంపై ఆధారపని ఉంటుందని తెలిపారు. నేడు డబ్బే ప్రాధాన్యత తీసుకొని



కొన్ని స్కూల్ నడుపుతున్నరని వాటికి సమర గీతం పాడి విద్యార్థుల భవిష్యత్తు కొరకు పాటుపడవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. నేను ఈ స్కూల్ కి 13 సార్లు రావడం నాకు ఎంతో గర్వకారణమని సబితా ఇంద్రారెడ్డి గర్వ పడ్డారు. ప్రభుత్వాలు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే బాధ్యతను తీసుకోవాలని జెడి లక్ష్మీనారాయణ తెలిపారు. మారుమూల గ్రామంలో పేద విద్యార్థులను తీర్చిదిద్దుతున్న యాజమాన్యాలను అభినందించారు. తాను ఈ కార్యక్రమానికి రావడం తనను ఎంతగానో సంతోషనిచ్చిందని తెలిపారు. చిన్ననాటి పాఠశాలల్లో చదువుకున్న విద్య గుర్తుకొస్తుందని తెలిపారు.పాఠశాలలో మంచి మార్కులు ర్యాంకులు సాధించిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే యాదయ్య , ప్రిన్సిపల్ పల్లగొల్ల కృష్ణ యాదవ్, స్థానిక నాయకులు , ప్రగతి రిసార్ట్స్ జీవీకే రావు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు..



నేను బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచినా నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో పనిచేస్తున్నా. ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రచారం చేస్తారని అంతా అడుగుతున్నారు. నేను కాంగ్రెస్‌కే ఓటు వేయాలని చెబుతా. రేవంత్ ఐదేళ్లు సీఎంగా ఉంటారు. ఆయనకు ఎమ్మెల్యేలతోపాటు ప్రజల సపోర్టు ఉంది.

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హుస్నాబాద్ మున్సిపాలిటీ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రతిపక్షం హుస్నాబాద్, జనవరి 25:

హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. దాదాపు 26 కోట్ల రూపాయల తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గత 10 సంవత్సరాలుగా చేయని అభివృద్ధి రెండు సంవత్సరాల్లో చేసి చూపించమని మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసేలా కాంగ్రెస్ పార్టీనీ ఆశీర్వదించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ కి గత రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వెల్లడించారు. హుస్నాబాద్ అంటే వెంటనే స్పందించేలా రాష్ట్రంలో మంచి గుర్తింపు తీసుకొచ్చానని ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలతో పాటు గతంలో జరిగిన పార్లమెంట్ ,ఎమ్మెల్సి ఎన్నికల్లో ఇచ్చిన మద్దతు తాజాగా జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఉండాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ సస్య శ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ కరీంనగర్, హుస్నాబాద్ అక్కన్న పేట మధ్య నాలుగు లైన్ ల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం చేస్తున్నామని ఇక్కడి ప్రజలకు 24 గంటలు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని ,పీజీ కాలేజీ రావడంతో పాటు ఇక్కడే సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్ ఉండనున్నారని పేర్కొన్నారు.త్వరలోనే చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ వస్తుందని తెలిపారు.హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఈరోజు కొత్త చెరువు 7.79 కోట్లు ,పల్లె చెరువు ,ఎల్లమ్మ చెరువు కాలువల పునరుద్ధరణకు మరో 3 కోట్లు రూపాయలతో శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు. అంతకుముందు హుస్నాబాద్ మార్కెట్ యార్డు లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గత 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వలేదని ప్రజా పాలన ప్రభుత్వం లో తాము నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అవి పూర్తవుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో 500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని తమ ప్రభుత్వం అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు ఇస్తుందన్నారు. దేశం లో 29 రాష్ట్రాల్లో లేని సన్న బియ్యం పంపిణీ ఒక తెలంగాణ లోనే ఇస్తున్నామని చెప్పరు. హుస్నాబాద్ పట్టణంలో 80 శాతానికి పైగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని ఇప్పటి వరకు 9 వేల కోట్ల రూపాయలు విలువైన ప్రయాణం చేశారనీ గుర్తు చేశారు. హుస్నాబాద్ ప్రాంతంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలుకతుర్తి ఎమ్మార్వో కార్యాలయాన్ని ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని , కోహెడ లో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. హుస్నాబాద్ లో రికార్డ్ స్థాయిలో వర్షం పడి ధాన్యం కొట్టుకుపోతే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశామని,జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కారం చేశామన్నారు. రిజర్వేషన్ల మార్పులో మంత్రులు , ఎమ్మెల్యేల, అధికారుల ప్రమేయం లేదన్నారు. గత ప్రభుత్వంలో 10 సంవత్సరాల్లో చేయని అభివృద్ధి తాము రెండు సంవత్సరాల్లో చేసి చూపించమని ప్రకటించారు. హుస్నాబాద్ ప్రజలంత తనకి అండగా నిలబడి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.





గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులు 2026ను ఆదివారం ప్రకటించింది. బాలీవుడ్‌కు విశేష సేవలందించిన ప్రముఖ నటుడు ధర్మేంద్ర సింగ్ డియోల్ (మరణానంతరం)కు పద్మ విభూషణ్ ప్రకటించారు. కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ (మరణానంతరం), సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కేటీ థామస్, వయోలిన్ విద్వాంసురాలు ఎన్ రాజం, ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్‌కు కూడా పద్మవిభూషణ్ పురస్కారం వరించింది. ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి, జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సొరేన్, ప్రముఖ వైద్యులు నోరి దత్తాత్రేయుడు సహా 13 మందికి పద్మభూషణ్ ప్రకటించారు. ప్రముఖ క్రికెటర్ రోహిత్ శర్మ, భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సహా 113 మంది పద్మశ్రీ పురస్కారం లభించింది. ప్రముఖ తెలుగు నటులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్, గంధం చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను హతమార్చిన ఎస్‌టీఎఫ్‌కు నేతృత్వం వహించిన సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీ కే విజయ్ కుమార్ కూడా పద్మశ్రీ అవార్డు గ్రహీతల్లో ఉన్నారు. మొత్తంగా ఈ ఏడాది 131 మందికి పద్మ అవార్డులు దక్కాయి. మొత్తం అవార్డు గ్రహీతల్లో 90 మంది మహిళలు ఉన్నారు. జాబితాలో విదేశీయులు, ఎన్‌ఆర్‌ఐ, పీఐవో, ఓసీఐ క్యాటగిరీ కింద ఆరుగురికి అవార్డులు ప్రకటించారు. మరణానంతరం 16 మందికి అవార్డులు ప్రకటించారు.

విశ్వ వీక్షణం



భారత వ్యోమగామి
శుభాంశు శుక్లాకు అశోక చక్ర

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించి తొలి భారతీయుడిగా రికార్డుకెక్కిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు భారతదేశ అత్యున్నత శౌర్య పురస్కారమైన అశోక చక్ర వరించింది. ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో ఈ అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది జూన్‌లో శుక్లా అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా, యాక్సియమ్ 4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌పై అడుగు పెట్టిన మొదటి వ్యక్తిగా నిలిచారు. గతేడాది నిర్వహించిన యాక్సియం 4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విజయవంతంగా అంతరిక్ష యాత్ర పూర్తి చేసిన ఘనతను సాధించారు. యాక్సియం 4 మిషన్‌లో భాగంగా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీవిస్నియెస్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లతో కలిసి ఐఎస్ఎస్‌కు వెళ్లిన శుభాంశు అంతరిక్షంలో అనేక రకాల ప్రయోగాలు చేశారు. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై ఆయన అధ్యయనం చేశారు. 'ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది' వంటి అంశంపై ఒక వీడియోను చిత్రీకరించారు. అంతరిక్షంలో వ్యోమగాముల మానసిక ఆరోగ్యంపై కూడా ఆయన అధ్యయనం చేశారు. గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో పాటు మరికొంత మందిని కూడా అవార్డులు వరించాయి. ఇందులో అశోక చక్ర, కీర్తి చక్ర, శౌర్య చక్రల అవార్డులు ఉన్నాయి. గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌కు కీర్తి చక్ర పురస్కారం లభించింది. మేజర్ అర్షదీప్ సింగ్, నాయబ్ సుబేదార్ దోలేశ్వర్ సుబ్బాకు కీర్తి చక్ర పురస్కారాలు వరించాయి. వీరితో పాటు 13 మంది త్రివిధ దళాలకు చెందినవారిని శౌర్య చక్ర పురస్కారాలు వరించాయి. ఒకరికి బార్ టు సేన మెడల్ రాగా, 44 మందికి సేనా మెడల్ ఆరుగురికి నౌ సేన మెడల్, ఇద్దరికి వాయు సేనా మెడల్ ప్రకటించారు. అదే విధంగా 30 మంది త్రివిధ దళాల అధికారులకు పరమవిశిష్ట సేవా మెడల్ ప్రకటించారు. త్రివిధ దళాలనకు చెందిన మరో నలుగురికి ఉత్తమ యుద్ధ సేవా మెడల్, మరో 56 మందికి అతి విశిష్ట సేవా మెడల్ అందగా, మరో 9 మందికి యుద్ధ సేవా మెడల్ వరించింది.



మొలకలల్లో మల్టీ విటమిన్స్

మన శరీరానికి అవసరమయ్యే అన్ని పోషకాలను కలిగి ఉండే ఆహారాల్లో మొలకలు కూడా ఒకటి. ఇవి చూడడానికి చిన్నగా ఉన్నప్పటికీ ఇవి పోషక శక్తి కేంద్రాలు అని చెప్పవచ్చు. ఇవి మన ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా మార్చగల శక్తిని కలిగి ఉంటాయి. వీటిని రోజూ ఉదయం ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, శక్తి స్థాయిలను పెంచడంలో, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా మొలకలు మనకు సహాయపడతాయి. ఇవి మొత్తం శరీరానికి మేలు చేస్తాయని వీటిని రోజూ ఆహారంలో భాగంగా తీసుకునే ప్రయత్నం చేయాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజూ ఆహారంలో భాగంగా మొలకలను తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.



జీర్ణ ఎంజైమ్‌లు..

మొలకల్లో సహజ ఫైబర్ తో పాటు జీర్ణ ఎంజైమ్‌లు కూడా ఉంటాయి. మొలకలను ఉదయం పూట తీసుకోవడం వల్ల ఆహారం సులభంగా విచ్ఛినం అవుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల పేగుల కదలికలు ఎక్కువగా ఉంటాయి. మలబద్దకం సమస్య తగ్గుతుంది. పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మొలకల్లో సహజంగా ఉండే జీర్ణ ఎంజైమ్ లు ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్, కొవ్వులను విచ్ఛినం చేయడంలో సహాయపడతాయి. తద్వారా మన శరీరానికి పోషకాలు సక్రమంగా అందుతాయి. మొలకలను తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ బలోపేతం అవుతుంది. మొలకల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడతాయి.



ఇన్‌ఫెక్షన్లు రాకుండా..

ఉదయం పూట మొలకలను తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్ లు మన దరి చేరకుండా ఉంటాయి. అనారోగ్య సమస్యల నుండి త్వరగా కోలుకోగలుగుతాం. మొలకలను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. దీంతో మనం దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటాం. వీటిని అల్పాహారంలో భాగంగా క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల సాధారణ జలుబు, కాలానుగుణంగా వచ్చే ఫ్లూ వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. సాధారణంగా మొలకల్లో ప్రోటీన్, ఐరన్, క్యాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి స్థిరమైన, సహజ శక్తిని అందిస్తాయి. వీటిని ఉదయం పూట ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం రోజంతా ఉత్సాహంగా పని చేసుకోవచ్చు. నీరసం, అలసట వంటి సమస్యలు మన దరి చేరకుండా ఉంటాయి

బరువు తగ్గేందుకు..

మొలకల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి, ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మొలకలను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. దీంతో మనకు చిరుతిండి తినాలన్న కోరిక కలగకుండా ఉంటుంది. తద్వారా మనం ఆరోగ్యకరంగా బరువు తగ్గవచ్చు. మొలకల్లో విటమిన్ ఎ, సి, ఇ వంటివి ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన చర్మం, జుట్టును నిర్వహించడంలో సహాయపడతాయి. ఉదయం పూట మొలకలను తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృద్ధాప్య ఛాయలు మన దరి చేరకుండా ఉంటాయి. జుట్టు కుదుళ్లు బలంగా తయారవుతాయి. జుట్టు రాలడం తగ్గుతుంది. మొలకలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మెరిసే ఆరోగ్యకరమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. ఇలా అనేక రకాలుగా మొలకలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మొలకలను ఆహారంలో భాగంగా స్థిరంగా తీసుకోవడం వల్ల శరీరం లోపలి నుండి ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



రాజ్యాంగమే దేశ ఐక్యతకు పునాది



రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ నిబంధనల ద్వారా జాతీయ స్ఫూర్తికి, దేశ ఐక్యతకు బలమైన పునాదిని వేశారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ తెలిపారు. దేశ ప్రజలమైన మనం స్వదేశంలో, విదేశాల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోబోతున్నామని స్పష్టం చేశారు. సోమవారం దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ద్రౌపదీ ముర్మ ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగించారు. భారతీయ మహిళలు సంప్రదాయ మూస పద్ధతులను బద్దలు కొట్టి ముందుకు సాగుతున్నారని ద్రౌపదీ ముర్మ కొనియాడారు. నారీమణులు దేశ సర్వతోముఖాభివృద్ధికి చురుకుగా తోడ్పడుతున్నారని వెల్లడించారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు, స్వయం ఉపాధి నుంచి సాయుధ దళాల వరకు ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. క్రీడా రంగంలోనూ టీమ్ ఇండియా ఒమెన్ క్రికెటర్లు ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలను నెలకొల్పారని గుర్తు చేసుకున్నారు."గతేడాది నవంబర్‌లో టీమ్ ఇండియా మహిళా క్రికెటర్లు ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను, ఆ తర్వాత బ్లైండ్ మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు. గత సంవత్సరం చెస్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ ఇద్దరు భారతీయ మహిళల మధ్య జరిగింది. ఈ ఉదాహరణలు క్రీడా ప్రపంచంలో భారత్‌కు చెందిన నారీమణుల ఆధిపత్యానికి నిదర్శనం. దేశ ప్రజలు వారిని చూసి గర్విస్తున్నారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళా ప్రతినిధుల సంఖ్య దాదాపు 46 శాతంగా ఉంది. మహిళల రాజకీయ సాధికారతను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు 'నారీ శక్తి వందన్ అధినియం' మరింత బలాన్ని ఇస్తుంది. వికసిత భారత్ నిర్మాణంలో నారీ శక్తి పాత్ర కీలకమైనది" అని ముర్మ అన్నారు.

బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ యువకుడి సజీవ దహనం!



బంగ్లాదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. ఓ హిందూ యువకుడిని దుండగులు సజీవ దహనం చేశారు. శుక్రవారం రాత్రి నార్సింగ్ది ప్రాంతంలోని ఓ షాప్‌లో చంచల్ చంద్ర భౌమిక్(23) అనే యువకుడు నిద్రిస్తుండగా దుండగులు దాడి చేశారు. షాప్ షట్టర్ మూసేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు.మంటల వేడికి నిద్రలో నుంచి లేచిన చంచల్ బయటపడేందుకు విఫలయత్నం చేశాడు. చంచల్ మంటల్లో కాలి చనిపోయాడని నిర్ధారించుకున్నాకే దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు.

టెహ్రాన్ బంకర్‌లో ఇరాన్ సుప్రీం లీడర్



అమెరికా దాడి చేస్తుందనే భయాలు ఇరాన్‌ను చుట్టుముట్టాయి. దాంతో దేశాధినేతల రక్షణ కోసం అధికారులు చర్యలు మొదలు పెట్టారు. అందులో భాగంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ని అధికారులు టెహ్రాన్ లోని సురక్షితమైన బంకర్‌కు తరలించినట్లు సమాచారం.అమెరికా దాడిచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న సీనియర్ మిలిటరీ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఖమేనీ ఆశ్రయం పొందుతున్నారు. దీన్ని టెహ్రాన్‌లోని పలు సొరంగాలకు అనుసంధానం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సుప్రీం లీడర్ తన కార్యాలయ బాధ్యతలను చిన్న కుమారుడు మసూద్ ఖమేనీకి అప్పగించినట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్యనిర్వాహక వర్గంతో సమన్వయ పనులు కూడా ఆయనే చూడనున్నట్లు మీడియా వర్గాలు తెలిపాయి. అయితే ఈ వార్తలపై ఇరాన్ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన లేదు. ఇరాన్‌లో పరిపాలనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు చెలరేగాయి. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనకారులకు హాని కలిగితే రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. ఆ దేశంపై సైనికచర్యకు కూడా సిద్ధమవగా చివరి నిమిషంలో నిర్ణయాన్ని రద్దు చేసుకున్నారు. అయితే, ఇటీవల భారీ సంఖ్యలో తమ యుద్ధ నౌకలు ఇరాన్‌వైపు కదులుతున్నాయని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ఇరాన్‌లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి.



మూడో టీ20లో భారత్ జయభేరి.. సిరీస్ కైవసం

మరో రెండు వారాల్లో సొంతగడ్డపై మొదలుకాబోతున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఆతిథ్య భారత జట్టు మరోసారి అదరగొట్టింది. స్వదేశంలో 15 నెలల వ్యవధిలోనే న్యూజిలాండ్‌కు టెస్టు, వన్డే సిరీస్‌ను కోల్పోయి తీవ్ర విమర్శలెదుర్కొంటున్న టీమ్‌ఇండియా.. టీ20ల్లో మాత్రం కివీస్‌కు ఆ అవకాశమివ్వలేదు. బ్యాట్, బంతితో రెచ్చిపోతున్న టీమ్‌ఇండియా.. గువాహటి వేదికగా జరిగిన మూడో టీ20లో ప్రత్యర్థిపై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌లో 30 ఆధిక్యం సాధించింది. ఇరుజట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో కివీస్ నిర్దేశించిన 154 పరుగుల లక్ష్యాన్ని సూర్య సేన.. 10 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. అభిషేక్ శర్మ (20 బంతుల్లో 68 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఎప్పట్లాగే విధ్వంసం సృష్టించగా గత మ్యాచ్‌తో ఫామ్‌ను అందుకున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచికొట్టడంతో మరో 60 బంతులు మిగిలుండగానే మెన్ ఇన్ బ్లూను విజయం వరించింది. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' బుమ్రా (3/17), రవి బిష్ణోయ్ (2/18), హార్దిక్ పాండ్యా (2/23) ధాటికి నిర్ణీత ఓవర్లలో 153/9కే పరిమితమైంది. గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 48, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్.

స్కోర్ల వివరాలు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 153/9 (ఫిలిప్స్ 48, చాప్‌మన్ 32, బుమ్రా 3/17, బిష్ణోయ్ 2/18);

భారత్: 10 ఓవర్లలో 155/2 (అభిషేక్ 68*, సూర్య 57*, హెన్రీ 1/28, సోధి 1/28)



లెజెండరీ ఆటగాళ్ల సరసన రోహిత్, హర్మన్‌ప్రీత్



భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అత్యున్నత పౌరపురస్కారం దక్కింది. క్రికెట్‌కు విశేష సేవలందించినందుకుగానూ హిట్‌మ్యాన్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీని ప్రకటించింది. భారత మహిళల జట్టును వన్డే ప్రపంచకప్ విజేతగా నిలిపిన చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైంది. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పునస్కరించుకొని ఆదివారం కేంద్ర ప్రభుత్వ పద్మ పురస్కారాలను ప్రకటించింది. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ ను 'పద్మ భూషణ్' వరించింది భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు తగిన గౌరవం దక్కింది. సారథిగా టీమిండియాకు టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ కట్టబెట్టిన రోహిత్ పద్మశ్రీకి ఎంపికయ్యాడు. నిరుడు స్వదేశంలో అద్భుత కెప్టెన్సీతో మహిళల జట్టుకు తొలిసారి వన్డే వరల్డ్‌కప్ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సైతం ఈ పురస్కారం అందుకోనుంది. మహిళా క్రికెటర్లలో ఈ ఘనత సొంతం చేసుకున్న ఐదో ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్, పురుషుల క్రికెట్‌లో ఈ అవార్డుకు ఎంపికైన 17వ ఆటగాడిగా రోహిత్ గుర్తింపు సాధించారు.

పద్మశ్రీ గెలుపొందిన తొలితరం క్రికెటర్లుగా డి.బీ. డియోధర్(1965), మన్సూర్ అలీఖాన్ పటౌడీ(1967), చందు బోర్డే(1969), బిషన్ సింగ్ బేడీ(1970)లు చరిత్రలో నిలిచారు. 1999లో కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ ఈ పురస్కారం స్వీకరించారు. రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్, హర్భజన్ సింగ్, ఎంఎస్ ధోనీ, యువరాజ్ సింగ్, విరాట్ కోహ్లీ, అశ్విన్ సైతం ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్నారు. మహిళా క్రికెటర్లలో హర్మన్‌ప్రీత్ కౌర్ కంటే ముందు శాంతా రంగస్వామి, డయాన ఎడుల్జి, మిథాలీ రాజ్, ఝులాన్ గోస్వామి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.



బంగ్లా నిరాకరణ.. స్కాట్లాండ్‌కు వరం

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం స్కాట్లాండ్ క్రికెట్ జట్టుకు కలిసొచ్చిందనే చెప్పవచ్చు. భద్రత కారణాలతో వరల్డ్‌కప్‌లో ఆడేందుకు భారత్‌కు రావడానికి నిరాకరించిన బంగ్లాను ఐసీసీ టోర్నీ నుంచి తొలగించింది. ఆ స్థానంలో ర్యాంకింగ్స్ ప్రకారం స్కాట్లాండ్‌ను ఎంపిక చేసింది. దీంతో అసలు రేస్‌లోనే లేని జట్టు ఏకంగా టోర్నమెంట్‌కు దూసుకొచ్చింది. మరి దీనిపై స్కాట్లాండ్ రియాక్షన్ ఏంటంటే?బంగ్లా స్థానాన్ని తమ జట్టుతో రిప్లేస్ చేస్తున్నట్లు ఐసీసీ ప్రకటించగానే స్కాట్లాండ్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. తమ జట్టు స్టార్ ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలు షేర్ చేసింది. దీనికి 'ఎల్లప్పుడూ సిద్ధమే' అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. అంతేకాకుండా వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు తమ జట్టుతో కలిసి భారత్‌కు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంది. దీనిపై స్కాట్లాండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ట్రూడీ లిండ్‌బ్లేడ్ శనివారం మాట్లాడారు. తమ జట్టును వరల్డ్‌కప్ టోర్నీకి ఆహ్వానించినందుకు ఐసీసీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 'టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేందుకు మా జట్టు సిద్ధంగా ఉందా? అంటూ ఇవాళ ఉదయమే మాకు మెసేజ్ వచ్చింది. దీనికి మేం వెంటనే ఓకే చెప్పేశాం. ఈ ఆహ్వానాన్ని అందించినందుకు ఐసీసీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ప్రపంచ వేదికపై పోటీ పడటానికి స్కాట్లాండ్ ఆటగాళ్లకు ఇది ఒక అద్భుతమైన అవకాశం. అయితే కొన్ని సవాళ్లు, ప్రతికూలత అంశాల మధ్య ఈ ఛాన్స్ దక్కిందని మాకు తెలుసు. పలు పర్యటనల్లో ఆడేందుకు మా జట్టు కొన్ని వారాలుగా ప్రాక్టీస్ చేస్తుంది. ఇక వీలైనంత త్వరగా మేం భారత్‌కు చేరుకోవడానికి ఏర్పాట్లు ప్రారంభించాం. అక్కడ జరగబోయే ప్రపంచకప్‌లో పాల్గొని, మా వంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాం' అని ట్రూడీ శనివారం మీడియాతో పేర్కొన్నారు.




నఖ్వీ వ్యాఖ్యలపై ఐసీసీ సీరియస్

టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించడంతో పాకిస్థాన్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలపై ఐసీసీ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఐసీసీ పక్షపాత నిర్ణయాలు తీసుకుంటుందని పీసీబీ చీఫ్ నఖ్వీ ఆరోపించారు. అయితే టోర్నీ నుంచి బంగ్లాను తప్పించడంతో పాకిస్థాన్ కూడా ఈ వరల్డ్‌కప్‌ను బాయ్‌కట్ చేయాలని ఆలోచిస్తుందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ పాకిస్థాన్ గనుక ఆ నిర్ణయం తీసుకుంటే మాత్రం ఐసీసీ దీనిని అత్యంత సీరియస్‌గా తీసుకోనుందని సమాచారం. అందుకు పాక్‌పై కఠినమైన ఆంక్షలు విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆంక్షలు ఇవే!

ఈ ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పాల్గొనకుండా నిర్ణయం తీసుకుంటే, ఆ జట్టు ఇతర దేశాలతో ఆడే ద్వైపాక్షిక సిరీస్‌లు రద్దు చేయాలన్న ఆలోచనలో ఐసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తమ దేశవాళీ టోర్నమెంట్ పాకిస్థాన్ సూపర్ లీగ్ లో ఆడేందుకు ఫారిన్ ఆటగాళ్లకు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) ఇచ్చేందుకు నిరాకరిస్తుందట. వీటితోపాటుగా ప్రతిష్ఠాత్మకమైన ఆసియా కప్ టోర్నమెంట్‌లో పాల్గొనకుండా పాకిస్థాన్‌ను బహిష్కరించేందుకు కూడా సిద్ధమైందని క్రీడా వర్గాల సమాచారం. 'ఒకవేళ పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్‌లో ఆడేందుకు నిరాకరిస్తే కఠిన చర్యలు తప్పవు. అంతర్జాతీయ స్థాయిలో ఏ జట్టుతోనూ వాళ్లకు ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవు. వాళ్ల డొమెస్టిక్ లీగ్ పీఎస్ఎల్‌లోనూ ఆడేందుకు ఫారిన్ ప్లేయర్లను అనుమతించం. అలాగే ఆసియా కప్ నుంచి కూడా తొలగిస్తాం' అని ఐసీసీ అధికారి చెప్పినట్లు జాతీయ మీడియా వెల్లడించింది.



మమ్ముట్టి, మోహన్‌లాల్ పేట్రియాట్

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ బహుభాషా చిత్రం 'పేట్రియాట్'. ప్రముఖ దర్శకుడు మహేష్ నారాయణన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ 'కల్నల్ రహీమ్ నాయక్'గా, మమ్ముట్టి 'డాక్టర్ డేనియల్ జేమ్స్'గా నటిస్తున్నారు. వీరిద్దరూ కలిసి ఒక అక్రమ ఆపరేషన్‌ను ఎలా అడ్డుకున్నారనేది కథాంశం. ఈ సినిమాలో ఫహద్ ఫాసిల్, కుంచాకో బోబన్, రేవతి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నయనతార ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌పై 'విభేదించడం కూడా దేశభక్తే' అనే క్యాప్షన్ ఉండటం ఆసక్తికరంగా మారింది. మోహన్‌లాల్, మమ్ముట్టి వంటి దిగ్గజాలతో పాటు నయనతార కీలక పాత్రలో నటిస్తుండటంతో ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్నాయి. సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



అనిల్ రావిపూడికి మెగా సర్‌ప్రైజ్

మెగాస్టార్ చిరంజీవి తన చిత్ర దర్శకుడు అనిల్ రవిపూడికి ఓ విలువైన బహుమతి ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు. ఇటీవల వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మన శంకరవర ప్రసాద్' సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సందర్భంగా, అనిల్‌కు చిరంజీవి సరికొత్త రేంజ్ రోవర్ స్పోర్ట్ కారును బహూకరించారు. సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.292 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి, తెలుగు సినీ పరిశ్రమలో ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్‌గా, చిరంజీవి కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌గా నిలిచింది. ఈ భారీ విజయాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సెలబ్రేషన్ నైట్‌లో చిరంజీవి ఈ సర్‌ప్రైజ్ గిఫ్ట్‌ను అనిల్ రవిపూడికి అందించారు. గతంలో అనిల్ రవిపూడి పుట్టినరోజు సందర్భంగా కూడా చిరంజీవి ఓ ఖరీదైన వాచ్‌ను బహుమతిగా ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో ఏకంగా లగ్జరీ కారునే బహుమతిగా ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారు. చిత్ర పరిశ్రమలో ఇలాంటి ఖరీదైన బహుమతులు అరుదుగా ఉంటాయి. దర్శకుడి ప్రతిభను, సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిరంజీవి ఇచ్చిన ఈ మెగా గిఫ్ట్ ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



నిఖిల్ డైరెక్టర్‌తో నితిన్ సినిమా..

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యువ హీరోల్లో ఒకరు నితిన్. చివరగా తమ్ముడు సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేకపోయింది. ఫైనల్‌గా తన కొత్త ప్రాజెక్ట్ 36వ సినిమాను ప్రకటించాడు. ఈ సారి నిఖిల్ హీరోతో తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయ్యాడు. ఎక్కడికి పోతావు చిన్నవాడా సినిమాతో నిఖిల్‌కు మంచి బ్రేక్ అందించాడు డైరెక్టర్ వీఐ ఆనంద్. చివరగా ఊరు పేరు భైరవకోన సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వీఐ ఆనంద్ తాజాగా నితిన్‌తో సినిమా చేస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో రాబోతున్న ఈ మూవీ ప్రీ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు మేకర్స్. గుబురు గడ్డంతో ఉన్న నితిన్ సిగరెట్ తాగుతుండటం చూడొచ్చు. ఇంతకీ వీఐ ఆనంద్ నితిన్‌తో ఎలాంటి సబ్జెక్టును ప్లాన్ చేస్తున్నాడనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరోయిన్, మ్యూజిక్ డైరెక్టర్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, షూటింగ్ ఎప్పటినుంచి మొదలవుతుందనే వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది నితిన్ టీం. మరి నిఖిల్‌ను బ్రేక్ అందించిన వీఐ ఆనంద్ నితిన్‌కు కూడా మంచి సక్సెస్ అందించాలని మూవీ లవర్స్ ఆకాంక్షిస్తూ.. ఇద్దరికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. నో బాడీ.. నో రూల్స్ క్యాప్షన్‌తో రాబోతున్న ఈ సినిమా ప్రీ లుక్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.



అకీరా నందన్‌పై డీప్‌ఫేక్ వీడియో.. నిందితుడి అరెస్ట్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్‌ను లక్ష్యంగా చేసుకుని ఏఐ టెక్నాలజీతో డీప్‌ఫేక్ వీడియో రూపొందించి, సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అకీరా పేరు, ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా ఉపయోగించి ఈ నకిలీ కంటెంట్‌ను సృష్టించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ డీప్‌ఫేక్ వీడియోల కారణంగా తన వ్యక్తిగత గోప్యతకు, భద్రతకు ముప్పు ఏర్పడిందని పేర్కొంటూ అకీరా నందన్ ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తన పేరు, చిత్రాలు, వీడియోలను దుర్వినియోగం చేయకుండా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. సెలబ్రిటీలు, ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల పేర్లతో ఫేక్ వీడియోలు సృష్టించడం తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అనుమానాస్పద కంటెంట్‌ను షేర్ చేయకుండా, వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

రిస్క్ చేస్తేనే 'మహానటి' దొరికింది



సున్నితమైన భావోద్వేగాలు, సహజమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న దర్శకుడు-రచయిత కిషోర్ తిరుమల ప్రయాణం ప్రత్యేకమైనది. 2008లో 'నేను మీకు తెలుసా' సినిమాతో రచయితగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన, 2011లో దర్శకుడిగా మారి ప్రేమ, కుటుంబ బంధాలు, యువత మనోభావాలను నిజాయితీగా చూపిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. 'నేను శైలజ', 'ఉన్నది ఒకటే జిందగీ', 'చిత్రలహరి', 'రెడ్', 'ఆడవాళ్లు మీకు జోహార్లు' వంటి విభిన్న చిత్రాలతో దర్శకుడిగా స్థిరపడ్డారు. ముఖ్యంగా 'నేను శైలజ' రామ్ పోతినేని కెరీర్‌లోనే కాదు, కిషోర్ తిరుమల ఫిల్మోగ్రఫీలో కూడా ఓ మైలురాయిగా నిలిచింది. అలాగే 'చిత్రలహరి'తో యూత్ ఎమోషన్స్‌ను హృద్యంగా ఆవిష్కరించి ప్రశంసలు అందుకున్నారు. దర్శకుడిగానే కాకుండా కథ, సంభాషణల రచయితగా, ఇటీవల 'మిరాయ్' సినిమాలో సీఐ అశోక్ పాత్రతో నటుడిగానూ తన పరిధిని విస్తరించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'నేను శైలజ' సినిమా హీరోయిన్ ఎంపికపై కిషోర్ తిరుమల చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. శైలజ పాత్ర ఇంట్రోవర్ట్ స్వభావం కలిగినదిగా ఉండటంతో, ఆ క్యారెక్టర్‌కు కీర్తి సురేశ్ అయితేనే సరిపోతుందని మొదటి నుంచే నమ్మినట్లు ఆయన తెలిపారు. అయితే అది కీర్తికి తొలి సినిమా కావడంతో, నిర్మాతలు అప్పట్లో టాప్‌లో ఉన్న స్టార్ హీరోయిన్‌ను తీసుకోవాలని సూచించారట. నిర్మాతల మాటకు గౌరవం ఇస్తూనే, ఓ ప్రముఖ హీరోయిన్‌కు కథ చెప్పినప్పటికీ కావాలనే పూర్తి ఎంగేజ్‌మెంట్‌తో చెప్పలేదని, ఆమెకు కథ నచ్చలేదని చెప్పగానే "థాంక్యూ" చెప్పి వచ్చేశానని ఆయన వెల్లడించారు. స్టార్ హీరోయిన్ ఇమేజ్‌ను బ్రేక్ చేసి ప్రేక్షకులు శైలజ పాత్రగా నమ్మడం కష్టమవుతుందని భావించి, కొత్త అమ్మాయిపై రిస్క్ తీసుకున్నానని చెప్పారు. చివరకు అదే నిర్ణయం సరైనదని నిరూపితమై, కీర్తి సురేశ్ నటన శైలజ పాత్రకు ప్రాణం పోసిందన్నారు. ఆ సినిమా కీర్తి కెరీర్‌కు బలమైన పునాది వేసి, ఆమెను 'మహానటి' వంటి జాతీయ స్థాయి గుర్తింపుకు చేర్చింది. ఇదిలా ఉండగా, తాజాగా మాస్ మహారాజా రవితేజతో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాతో కిషోర్ తిరుమల మరో హిట్ అందుకొని, సహజమైన కథనాలతో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200